# కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచల భద్రత


- మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు
- టిటిడిసి ప్రాంగణం లో 163 బి ఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు
- విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవు
- విజయం తర్వాత టపాకాయలు పేల్చరాదు
- ఏజెంట్లకు, వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులకు సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంకు పెన్నులకు అనుమతి లేదు
- సంబంధిత అధికారుల అనుమతులు తీసుకున్న తర్వాత నిర్దేశించిన రోజు మాత్రమే విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలి

14

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
శుక్రవారం 13-2-2026 పేజీ :12




07

# జోరందుకున్న క్యాంపు రాజకీయాలు

## ఫలితాలకు(కౌంటింగ్ ) ముందే అభ్యర్థుల భద్రతపై పార్టీల ఆందోళన

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఈ నెల 11న ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నేడు జరుగనున్న ( 13న) ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు. ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్ పార్టీల నాయకులతో పాటు పోటీ చేసిన అభ్యర్థులు , స్వతంత్ర అభ్యర్థులు కూడా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా, కొన్ని సర్వే సంస్థలు విడుదల చేసిన అంకెల అంచనాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# మున్సిపల్ ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు

- నిబంధనలు కచ్చితంగా పాటించాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

13



# వరుస దొంగతనాలకు పాల్పడిన గజదొంగ అరెస్టు



- 11.4 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం
- ఒక స్కూటీ రికవరీ
- ఉట్నూర్ మండలంలో ఏడు కేసులు ఛేదించిన పోలీసులు
- మంచిర్యాల స్కూటీ దొంగతనం లోనూ నిందితుడి ప్రమేయం వెలుగు
- సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేసిన జిల్లా ఎస్పీ
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

14



# ఎంపిడిఓ కార్యాలయ పనితీరుపై తీవ్ర అసంతృప్తి

- వాంకిడిలో పరిపాలనా వ్యవస్థపై ప్రశ్నార్థకం
- మండలంలో ఎంపిడిఓ కార్యాలయంపై చర్చనీయాంశం
- స్పందన లేక ఇబ్బందుల్లో ప్రజలు కలెక్టర్ జోక్యం కోరుతూ విజ్ఞప్తి
- పారదర్శకత లోపమా? వాంకిడిలో పరిపాలనపై అనుమానాలు సమర్థ పరిపాలన కోసం మండల ప్రజల వేడుకలు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో పరిపాలనా వ్యవస్థపై ఇటీవల తీవ్ర చర్చ మొదలైంది. ముఖ్యంగా మండల అభివృద్ధి అధికారి ఎంపిడిఓ కార్యాలయ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. వాంకిడి ఎంపిడిఓ కార్యాలయానికి వాట్సాప్ మరియు ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా సమాధానాలు, ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లభించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమాచారం కోసం ప్రయత్నించినా సమాధానం రాకపోవడంతో బాధితులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు కార్యాలయాన్ని ఆశ్రయించినప్పటికీ సరైన స్పందన లేకపోవడం, సమయానికి సమాధానాలు ఇవ్వకపోవడం వంటి అంశాలపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్వయంగా వాంకిడి ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదులపై స్పందన లేకపోవడంపై విమర్శలు మండలంలోని భూ సమస్యలు, గృహ నిర్మాణ పథకాలు, గ్రామాభివృద్ధి పనులు, పంచాయతీ సంబంధిత అంశాలు వంటి అనేక సమస్యలపై ప్రజలు కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారని సమాచారం. అయితే వినతిపత్రాలు అందజేసిన తర్వాత కూడా వాటిపై చర్యల పురోగతి తెలియజేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు ఇచ్చిన తర్వాత వారాలు గడిచినా స్పందన రాకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కొంతమంది బాధితుల ప్రకారం.. అధికారులను ప్రత్యక్షంగా కలవడానికి ప్రయత్నించినప్పుడు కూడా అందుబాటులో లేకపోవడం లేదా సరైన సమయం ఇవ్వకపోవడం జరుగుతోందని అంటున్నారు. దీనివల్ల ఒక చిన్న సమస్య పరిష్కారం కోసం కూడా పలుమార్లు కార్యాలయాన్ని చుట్టాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు కనీస మర్యాద కూడా చూపడం లేదని కొన్ని వర్గాల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్య వివరించడానికి ప్రయత్నిస్తే పూర్తి వివరాలు వినకుండా పంపించివేయడం, నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం వంటి అంశాలు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. ప్రజాసేవ చేయాల్సిన కార్యాలయం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే పరిపాలనపై నమ్మకం దెబ్బతింటుందని సామాజిక వర్గాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత ఉండాలని ప్రజలు కోరుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక, అభివృద్ధి పనుల ప్రగతి, నిధుల వినియోగం వంటి అంశాలపై స్పష్టత లేకపోవడం వల్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెబుతున్నారు. అధికారుల నుంచి సరైన సమాచారం లభించకపోవడం వల్ల ప్రజలు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోందని కొందరు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం కోరుతూ ఈ పరిస్థితుల్లో జిల్లా కలెక్టర్ వాంకిడి మండల ఎంపిడిఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యాలయ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అవసరమైతే తగిన మార్పులు చేయాలని వారు కోరుతున్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజల ఆకాంక్ష సమర్థ పరిపాలన మండల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు సకాలంలో చేరాలంటే స్థానిక పరిపాలన సమర్థంగా ఉండాలి.

# సింగరేణిలో మోగిన ఒక్క రోజు సమ్మె సైరన్




**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా గురువారం జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికులు విధులు బహిష్కరించి తీవ్ర నిరసన చేపట్టారు. ఈ ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్) ఆధ్వర్యంలో గనులన్నింటి వద్ద నిరసన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహించాయి. అనంతరం శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా, రాస్తారోకో చేపట్టి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టీయూసీ (ఐఎన్టియుసి) జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్, సీఐటీయూ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, టీబీజీకేఎస్ (టిబిజికేఎస్) ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ (ఐఎఫ్టియు) రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు దేశ శ్రామిక వర్గాన్ని తీవ్రంగా నష్టపరు స్తున్నాయని విమర్శించారు. జేఏసీ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి పలు డిమాండ్లను వినిపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు 47 వేల కోట్ల అప్పును వెంటనే చెల్లించాలని, బొగ్గు తవ్వక పనుల్లో కేవలం పర్మనెంట్ కార్మికులనే నియమించాలన్నారు . అదేవిధంగా సింగరేణిలో నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలని, సింగరేణిలో వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులకు న్యాయం చేయాలని, సింగరేణి కార్మికులందరికీ సొంత ఇంటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు . కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సమ్మెలో సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోరాటాన్ని విజయవంతం చేశారని జేఏసీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముసుకి సమ్మయ్య, ఎస్.కే. బాజీ, సైదా, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు, గర్గస్వామి జీవన్, జోయల్, సీఐటీయూ నాయకులు బాలాజీ, చంద్రశేఖర్, బండి రమేష్, పొగాకు రమేష్, ఐఎఫ్‌టీయూ నాయకుడు బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.



# లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే :తిర్యాణి ధర్నాలో కార్మిక నేతల డిమాండ్

**తిర్యాణి ఫిబ్రవరి 12( ప్రజా జ్యోతి ):** దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా గురువారం తిర్యాణి మండల కేంద్రం కార్మిక నిరసనలతో హోరెత్తింది. సీపీఎం, సీఐటీయూ, అంగన్‌వాడీ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళన కార్యక్రమం భారీ ఎత్తున సాగింది. చింతపల్లి నుంచి కొమురం భీం చౌరస్తా వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం కొమరం భీం చౌరస్తా బైఠాయించి నిరసన తెలిపారు ఈ సందర్భంగా సీఐటీయూ నేత టీకానంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త కార్మిక సంస్కరణలు, నాలుగు లేబర్ కోడ్‌లు కేవలం యజమానులకు లాభం చేకూర్చేలా ఉన్నాయని, ఇవి కార్మికుల ఉద్యోగ భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయని మండిపడ్డారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ సంస్కరణలను నిలిపివేయడంతో పాటు, ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు చేయకూడదని, నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని నేతలు స్పష్టం చేశారు. ఈ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై తమ పూర్తి మద్దతును ప్రకటించారు. కార్మికుల హక్కుల కోసం చేసే ఏ పోరాటానికైనా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుద్దే విజయ్, పెరుమండ్ల వెంకటేశం గౌడ్, తలండి సర్పంచ్ నైతం మంగు, గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు సుద్దాల తిరుపతి, ఆడ శ్యామ్ రావు, గాజుల శ్రీనివాస్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగు లచ్చ గౌడ్, గుండం శంకర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# రోబోటిక్స్ పోటీలలో రాష్ట్ర ప్రథమ స్థానాన్ని సాధించిన స్లేట్ విద్యార్థులు.

**జన్నారం,ఫిబ్రవరి12(ప్రజాజ్యోతి)** ఈ బాట్ ప్లస్ ఇన్నోవిటి రోబోటిక్స్ ఛాంపియన్ షిప్ 2025-26 పోటీలలో మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించారని స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ పోటీకి సంబంధించిన ఆన్లైన్ పరీక్ష జనవరి 10 వ తేదీన నిర్వహించగా స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ 7వ తరగతి కి చెందిన విద్యార్థులు శౌర్య,శ్రేయస్,వైభవ లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి 5000 రూపాయలు నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా స్లేట్ విద్యాసంస్థల చైర్మెన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు సాంకేతిక రంగాలలో , రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీలలో తీర్చిదిద్దడమే స్లేట్ విద్యాసంస్థల లక్ష్యమని భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి కన్న తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు,విద్య నేర్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను తీర్చిదిద్దిన & ఈ బాట్ ఇంచార్జి ఉపధ్యాయురాలు శ్రావణి తో పాటు విద్యార్థులను చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ శిరీన్ ఖాన్, ఉపాధ్యాయులు జాకీర్ ,అస్మా ,తల్లిదండ్రులు అభినందించారు.



# కార్మిక,రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించాలి

- టీపీఆర్పీ అసోసియేషన్
- దేశవ్యాప్త సమ్మెకు పెన్షనర్ల సంఘం మద్దతుగా నిరసన




**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీపీఆర్పీఏ ) రాష్ట్ర కార్యవర్గ నిర్ణయం మేరకు కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన గురువారం నాటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మంచిర్యాల జిల్లా అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా సంఘం నాయకులు సమ్మెలో పాల్గొని కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంచిర్యాల జిల్లా శాఖ అధ్యక్షులు కె. ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులకు రక్షణగా నిలిచిన కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మిక హక్కులకు భంగం కలిగించే విధంగా లేబర్ కోడ్స్ తీసుకురావడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. అలాగే ప్రజలందరిపై భారం మోపే విద్యుత్ సవరణ బిల్లు2025 ను ఉపసంహరించుకోవాలని, ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు (ఎఫ్ డి ఐ ) అనుమతి ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి నష్టం కలిగించే చట్టాలు, రైతు విత్తన సవరణ బిల్లును రద్దు చేయాలని, పెన్షనర్లకు తీవ్ర నష్టం కలిగించే వాలిడేషన్ చట్టం2025 ను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమ్మెలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ జి. చక్రధర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు భువనగిరి రాజారెడ్డి, బి. కుమారస్వామి, కే.ఎం.ఎస్. రెడ్డి, ఎం. పాండురంగ, జిల్లా కోశాధికారి ఆడెపు శంకరయ్య, కార్యదర్శులు హక్కు లచ్చన్న, కే. జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం

- .జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి:** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 66 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 132 మంది కౌంటింగ్ సహాయకులు, బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 19 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 37 మంది కౌంటింగ్ సహాయకులు, చెన్నూరు మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 10 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 20 మంది కౌంటింగ్ సహాయకులు,, క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 48 మంది కౌంటింగ్ సహాయకులు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 9 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ బెల్లంపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 34 వార్డులకు గాను 17 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, చెన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి 18 వార్డులకు గాను 9 టేబుల్స్ ఏర్పాటు చేసి, 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి సంబంధించి 15 వార్డులకు గాను 8 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, క్యాతనపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 22 వార్డులకు గాను 22 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్ కి 1 వేయి ఓట్ల చొప్పున 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని, మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి 60 వార్డులకు గాను 60 టేబుల్స్ ఏర్పాటు చేసి రౌండ్ కి 1 వేయి ఓట్ల చొప్పున లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవాలి



**మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి:** ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి సందర్శించి డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పనులు, ప్రజా సంక్షేమ పథకాల అమలు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజల సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కార్యాలయంలోని విభాగాలను పరిశీలించి కార్యాలయ సొంత భవనం నిర్మాణం కొరకు స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఈ నెల 13వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్, తహసిల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఎల్ఐసిలో వాటాల ఉపసంహరణ రద్దుచేయాలి

- దేశవ్యాప్త సమ్మెలో మంచిర్యాల బీమా ఉద్యోగులు

**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** ఎల్ఐసి సంస్థలో వాటాల ఉపసంహరణ వల్ల దేశ ప్రజల ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటాయని, ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని మంచిర్యాల ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసిఇయు) నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం మంచిర్యాల బీమా ఉద్యోగులు విధులను బహిష్కరించి స్థానిక ఎల్ఐసి కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. లాభాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేయడం పూర్తిగా ప్రజావ్యతిరేక చర్యగా అభివర్ణించారు. కొత్త లేబర్ కోడ్స్ ద్వారా కార్మిక హక్కులను హరించి, కార్పొరేట్లకు అనుకూల విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని నాయకులు ఆరోపించారు. స్వదేశీ మంత్రం జపించిన పాలకులు నేడు విదేశీ కంపెనీలకు గులాంగిరి చేయడాన్ని ప్రజలు ఎప్పటికీ హర్షించరని వారు విమర్శించారు. ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని, ఇందుకోసం ప్రజలే స్వయంగా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలో ప్రవచించిన సంక్షేమ రాజ్య భావనకు నేటి పాలకులు తిలోదకాలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటం దేశభక్తియుత పోరాటమని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిఈయూ కరీంనగర్ డివిజన్ సంయుక్త కార్యదర్శి రంగు రాజేశం, మంచిర్యాల శాఖ అధ్యక్షుడు ఎ. తిరుపతి రెడ్డి, కార్యదర్శి ఎం. రామదాసు, సీనియర్ నాయకులు రమేష్ బాబు, శైలజ, శ్రీనివాస్, చరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ నేరమే



**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాల రేడియాలజిస్టులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. పుట్టబోయే శిశువు ఆడా,మగా అని అడగడం, నిర్ధారించి చెప్పడం రెండూ నేరాలేనని తెలిపారు. లింగ నిర్ధారణ కోసం సంప్రదించిన వారు, ప్రోత్సహించిన వారు, చేయించుకున్న వారందరికీ గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ ఎంపిక నిషేధ చట్టం (పిసిపిఎన్డిటి ఆక్ట్ ) ప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందని, అందువల్ల ప్రతి వైద్యుడు చట్టాన్ని కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో గర్భవతులు, రోగులకు తగిన వైద్య సౌకర్యాలు, కూర్చోవడానికి సదుపాయం, వీల్ చైర్లు, మంచినీటి వసతి తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలకు వచ్చే ప్రతి రోగి వివరాలను సంబంధిత పోర్టల్లో నమోదు చేయాలని, కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన కొత్త ఫారంలలో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలన్నింటిలోనూ ఈ అంశాలపై పోస్టర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణశ్రీ, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ కోటేశ్వరరావు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, సీనియర్ రేడియాలజిస్టులు డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రాంబాబు, డాక్టర్ కీర్తి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ రవి, డాక్టర్ రూపా రమణి సహా 12 మంది రేడియాలజిస్టులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రభుత్వ వైద్యులు

**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజెన్లు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ వైద్యులు సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డులో ఉన్న వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య (సన్ సైన్ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్) లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి వయోవృద్ధులతో పాటు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా డాక్టర్లు, వైద్య సిబ్బంది హాజరైన వృద్ధులకు బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులు తదితర సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ, మోకాళ్లు, నడుం నొప్పులతో బాధపడే వృద్ధులకు ఫిజియోథెరపీ ద్వారా నొప్పులను ఎలా తగ్గించుకోవచ్చో ప్రత్యక్షంగా చేసి చూపించారు. అలాగే ఎలాంటి మందులు వాడాలి, ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను వృద్ధులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. వయోవృద్ధులు తమ ఆరోగ్యంపై అశ్రద్ధ వహించవద్దని, వారి ఆరోగ్య సమస్యల ప్రభావం కుటుంబ సభ్యులపై కూడా పడుతుందని డాక్టర్లు తెలిపారు. అవసరమైనప్పుడు



తప్పకుండా వైద్యులను సంప్రదించాలని, వారు సూచించిన విధంగా మందులు సకాలంలో వాడాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ శ్రావ్య (పాత మంచిర్యాల ,యు పి ఎచ్ ఎస్ ), డాక్టర్ ఎం. ఉషారాణి (నర్సింగ్ ఆఫీసర్ ,ఎం సి ఎచ్), జాడి వీణ (ఫిజియోథెరపిస్ట్ , జి జి ఎచ్), ఏఎన్ఎంలు ఏ. అంజలి, సునంద లు పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సన్ సైన్ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్, వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎస్. మొండయ్య, ప్రధాన కార్యదర్శి కే.ఎం.ఎస్. రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్. రాజిరెడ్డి, గౌరవాధ్యక్షులు పి. పోచయ్య, కోశాధికారి ఏ. రామయ్య, ఏ. రవీందర్, అల్లాడి కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# మామిడి పూత దశలో సస్యరక్షణ అవసరం

**త్రిప్స్ నివారణకు జిగట ఉచ్చులు ఏర్పాటు చేసుకోవాలి**

**-మామిడి తోటలను పరిశీలించిన ఉద్యానవన అధికారిణి కందుల సహజ**

**దండేపల్లి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** మామిడి తోటలు ప్రస్తుతం పూత దశలో ఉన్నందున, రైతులు నాణ్యమైన దిగుబడి కోసం సరైన సస్యరక్షణ పద్ధతులు పాటించాలని మంచిర్యాల డివిజన్ ఉద్యానవన అధికారిణి కందుల సహజ సూచించారు. గురువారం దండేపల్లి మండల కేంద్రంలోని పలు మామిడి తోటలను ఆమె సందర్శించి, పంట స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడి పూత దశలో త్రిప్స్ (తామర పురుగులు) ఉధృతి ఎక్కువగా కనిపిస్తోందని, వీటి నివారణకు తోటల్లో నీలి రంగు జిగట ఉచ్చులను అమర్చుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. పూత మరియు కాయ దశలో తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని తెలిపారు. అనవసరంగా రసాయన మందులు వాడకుండా, నిపుణుల సూచనల మేరకు మాత్రమే మందులను పిచికారీ చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ విస్తరణ అధికారిణి రాణి, రైతు సంఘం మండల అధ్యక్షులు బొలిశెట్టి లింగారెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, రైతులు గురువయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆ చర్యలకు అనుమతి లేదు- జిల్లా ఎస్పీ నితిక పంత్

**గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి కి లోబడి ఉండాలి**

**నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ హెచ్చరిక**

**విజయోత్సవ ర్యాలీలు ఊరేగింపులు కొరకు సంబంధిత అధికారులు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే జరుపుకోవాలి**



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ నితికాపంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు మరియు ఎలాంటి అసాంఘిక చర్యలు చోటుచేసుకోకుండా చూసేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు, కౌంటింగ్ కేంద్రాల వెలుపల 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమలులో ఉంటుందని తెలిపారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో భద్రత కోసం ప్రత్యేక బందోబస్తు, క్యూ.ఆర్.టి టీంలు, డాగ్ స్క్వాడ్ టీమ్స్, బాంబు డిస్పోసల్ టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచనున్నట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎస్పీ గారు ప్రజలకు, అభ్యర్థులకు, గెలిచిన వారిని ఉద్దేశించి ముఖ్య సూచనలు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పనిసరిగా పాటించాలి. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చటం, ఊరేగింపులకు ఎలాంటి అనుమతి లేదు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు పూర్తిగా నిషేధం. జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, గొడవలు అల్లర్లు సృష్టించే వారిని, నిబంధనలకు విరుద్ధంగా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించే వారిపై రిమాండ్ లోకి తీసుకోవలసి ఉంటుందని తెలిపారు. ర్యాలీలు లేదా ఊరేగింపులు నిర్వహించుట కొరకు సంబంధిత అధికారుల ఉత్తర్వుల మేరకు వారు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే జరుపుకోవాలి. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే, లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపా డాలని, ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఆశా కార్యకర్తల నిరసన: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్

**దండేపల్లి, ఫిబ్రవరి 12 ప్రజాజ్యోతి:** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దండేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా గురువారం స్థానిక మెడికల్ ఆఫీసర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, వివిధ ప్రభుత్వ సర్వేలు మరియు ప్రోగ్రామ్‌లకు సంబంధించి రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని వారు కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా18,000 వేల ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పారితోషికాలను వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు.మండలంలో ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను వెంటనే భర్తీ చేయడం ద్వారా ప్రస్తుతం ఉన్న వారిపై పని భారాన్ని తగ్గించాలని, తమ విన్నపాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు కె. విజయ, పి. పద్మ, ఎమ్. రాధ, కె. లలిత పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సింగరేణి నూతన సీఎండీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్టిపిపి ఈడీ

**జైపూర్ ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి :** సింగరేణి సంస్థ నూతన చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్గా నియమితులైన జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐఏఎస్ ని జైపూర్ ఎస్టిపిపి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్. చిరంజీవి హైదరాబాదులోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన సీఎండీ కి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందజేశారు.సింగరేణి సంస్థ మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్టిపిపి అధికారుల సంఘం అధ్యక్షుడు డి. పంతుల కూడా పాల్గొన్నారు. నూతన సీఎండీ నాయకత్వంలో సంస్థ మరింత ప్రగతి సాధిస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.



## కోల్ మైన్స్ పెన్షన్ పెంపుదలకు కృషి చేస్తున్న పెద్దపల్లి ఎంపీకి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల కృతజ్ఞతలు

**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** ఎంపీ గడ్డం వంశీకృష్ణ నిరంతర కృషి తో సింగరేణి కోల్ మైన్స్ పెన్షన్ సవరణకు కీలక ముందు అడుగు వేయడం పట్ల సింగరేణి విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపుదల కోసం నిరంతరం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి కీలక స్పందన రావడం హర్షించ దగ్గ విషయమని యాక్చురియల్ రిపోర్ట్ ఆధారంగా సింగరేణి కోల్ మైన్స్ పెన్షన్ సవరణ చేపట్టేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ ముందడుగు వేసిందని ఈ అంశంపై ఎంపీ వంశీకృష్ణ జనవరి 6న కేంద్ర బొగ్గు గనుల శాఖకు లేఖ రాసి, పెన్షన్ పెంపు , యాక్చురియల్ రీఅసెస్మెంట్ నిర్వహించాలని కోరడం జరిగిందని ఈ లేఖకు తాజాగా స్పందించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ అండర్ సెక్రటరీ రూపిందర్ బ్రార్, గతేడాది డిసెంబర్ 22న సీఎంపీఎఫ్ఓ ట్రస్టీల సమావేశం నిర్వహించామని లేఖలో వెల్లడించారు. ఆ సమావేశంలో కోల్ మైన్స్ పెన్షన్ నిధి మూల్యాంకనంతో పాటు యాక్చురీని నియమించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు అని ఈ యాక్చురీ పెన్షన్ పెంపు, నిధుల స్థితి మరియు ఇతర కీలక అంశాలను సమగ్రంగా పరిశీలించి నివేదిక అందించనుందని, ఆ యాక్చురీ రిపోర్ట్ ఆధారంగా సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కోల్ మైన్స్ పెన్షన్ సవరణ చేపట్టనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గురుఖవారం ఒక సమావేశంలో మాట్లాడుతూ, అతి తక్కువ పెన్షన్ పొందుతున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీస పెన్షన్‌ను 10 వేల వరకు పెంచాలని ఎంపీ వంశీ కృష్ణ శక్తివంచన లేకుండా పోరాడుతున్నారని, గతేడాది కూడా పార్లమెంట్‌లో పలుమార్లు ఈ పెన్షన్ పెంపుదల అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని. అలాగే పెన్షన్ పెంపుపై కేంద్ర



బొగ్గు గనుల శాఖకు లేఖలు కూడా ఎన్నో రాశారని , ఎంపీ లేఖపై స్పందించిన కేంద్రం బొగ్గు గనుల కార్యదర్శి యాక్చురీని నియమించినట్లు వెల్లడించడం శుభపరిణామమని యాక్చురీ రిపోర్ట్ ఆధారంగా కోల్ మైన్స్ పెన్షన్ పెరగనుందని అన్నారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంపుదలకు ఎంపీ వాగ్దానం చేయడం పట్ల ఎంపీ కి సింగరేణి విశ్రాంత ఉద్యోగులు తమ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పెరిగే వరకు నా పోరాటం ఆగదని పెన్షన్ పెంపు విషయంలో మీకు పూర్తి భరోసా ఇస్తున్నానని గడ్డం వంశీ కృష్ణ స్పష్టం చేయడం పట్ల గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశంలో ఎంపీకి తమ హృదయ పూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా అధికారులకు మాదిరిగానే సిపి ఆర్ఎంఎస్-ఎన్ (మెడికల్ కార్డ్) వైద్యం కొరకు 25 లక్షల వరకు పెంచే విధంగా, 2016 నుండే పెరిగిన గ్రాడ్యూటీ 20 లక్షలు చెల్లించే విధంగా కృషి చేయాలని ఎంపీ ని ఈ సమావేశంలో కోరారు. ఈ సమావేశం లో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఏ గంగయ్య, బూర్ల జ్ఞాని, నాయకులు కస్తూరి సూర్యం, రాజేశం, రామస్వామి, లక్ష్మణ్, బాపు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెలో బెల్లంపల్లి రీజియన్ సింగరేణి కార్మికుల నిరసన

### నాలుగు లేబర్ కోడ్ల దహనం



**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా గురువారం జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బెల్లంపల్లి రీజియన్ సింగరేణి సివిక్, సివిల్ విభాగాల కార్మికులు విధులు బహిష్కరించి తీవ్ర నిరసన చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తాలో నాలుగు లేబర్ కోడ్ పత్రాల దహనం చేస్తూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఐఎఫ్‌టీయూ తో పాటు సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రతను హరించే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్పొరేట్లకు దేశ పారిశ్రామిక రంగాన్ని కట్టబెట్టేందుకు అడ్డంకిగా ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా కుదించి అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. ఇప్పటికే దేశంలోని పారిశ్రామిక రంగం ప్రైవేటు కార్పొరేట్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ గుప్పెట్లోకి వెళ్లిపోయిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు, కార్మికులు, రైతుల ప్రయోజనాల కంటే కార్పొరేట్లకు, అమెరికా సామ్రాజ్యవాదానికి అనుకూలమైన విధానాలే నరేంద్ర మోడీకి దేశభక్తిగా మారాయని కార్మిక సంఘాలు ధ్వజమెత్తాయి. అమెరికాతో కుదుర్చుకున్న ట్రేడ్ డీల్ (తాత్కాలిక వ్యాపార ఒప్పందం) వల్ల చౌకగా లభించే రష్యా చమురును పక్కనపెట్టి, అధిక ధరలకు వెనిజులా నుంచి చమురు దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల పెంపు వల్ల రానున్న రోజుల్లో భారతదేశ ప్రజలపై విపరీతమైన ధరల భారం పడనుందని, ఈ భారం ఇప్పటికే సామాన్య, మధ్యతరగతి ఉద్యోగ జీవులపై తీవ్ర ప్రభావం చూపుతోందని, నిజ వేతనాలు పడిపోతూ ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని తెలిపారు. నరేంద్ర మోడీ భుత్వం అవలంబిస్తున్న కార్మికప్రజారైతాంగ వ్యతిరేక విధానాలను తరిమికొట్టేందుకే ఈ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతోందని స్పష్టం చేశారు. నాలుగు లేబర్ కోడ్లు, అమెరికాతో కుదుర్చుకున్న వ్యాపార ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసే వరకు కార్మికులు, రైతులు, ప్రజలు నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో పాల్గొన్న కార్మికులకు విప్లవ జై జైలు నినాదాలతో సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి. చాంద్ పాష, జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు చరణ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మణి రామ్ సింగ్, అలాగే గైనీ తిరుపతి, బొల్లు మల్లయ్య, పుల్లూరి పోశం, టీయూసీఐ నాయకులు శంకర్, రాజ్ కుమార్, ఎస్‌జీకేఎస్ కన్వీనర్ అంబాల మహేందర్, ఎన్నం శంకర్, టీఎస్‌యూఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు నీరటి రాజన్న, ఎస్‌సీసీడబ్ల్యూ యూఐఎఫ్‌టీయూ నాయకులు శ్యామ్, కృష్ణవేణి, వెంకటి, కొమురయ్య, శ్రీనివాస్, గణేష్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థ నూతన చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలసిన ఎస్టిపిపి ఈడి సిహెచ్. చిరంజీవి



**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** రఎస్టిపిపి ఈడి సిహెచ్. చిరంజీవి సింగరేణి సంస్థ నూతన చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించబడిన జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐఏఎస్‌ను గురువారం హైదరాబా దులోని ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించడం జేశారు .ఈ కార్యక్రమంలో ఎస్టిపిపి ఈడి తో పాటు ఎస్టిపిపి అధికారుల సంఘం అధ్యక్షుడు డి పంతుల పాల్గొన్నారు.

## కౌంటింగ్ రోజు కేంద్రాల పరిసరాల్లో 163 బిఎన్ఎస్ఎస్ అమలులో



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు (కౌంటింగ్)ను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు కాగజనగర్ పట్టణంలోని డి.ఎ.వి పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్ లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ కెమెరాలు, కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్ పరిసరాలు తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా మూడు అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేయాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ రోజున కేంద్రాల పరిసరాల్లో 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమలులో ఉంటుందని, అనధికార వ్యక్తులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది తప్ప మరెవ్వరూ కౌంటింగ్ కేంద్రాల పరిధిలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతర నిఘా, గస్తీ, కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాగజనగర్ లో డీఎస్పీ వాహిదుద్దీన్, కాగజనగర్ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఆసిఫాబాద్ లో ఆసిఫాబాద్ ఇన్స్పెక్టర్ బాలాజీ వర ప్రసాద్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ గజానంద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, పాల్గొన్నారు.



# పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు

మంత్రి వివేక్ వెంకటస్వామి



మంచిర్యాల, 11, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ): ప్రజాపాలన ప్రభుత్వంలో ఎన్నికలు పూర్తిగా పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని కార్మిక అండ్ మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా హైటెక్ సిటీలోని 227వ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి గారు తమ నివాసం నుంచి నడుచుకుంటూ వెళ్లి ఓటు వేయడం స్థానికుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఓటు అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టి, ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. ప్రజాపాలనలో సామాన్య ప్రజల అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత పాలనలో ఎక్కడా పోలీసు ఒత్తిడి లేదని పేర్కొన్న మంత్రి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసులను ఉపయోగించి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపి ంచారు. అప్పట్లో ప్రజాస్వామ్యాన్ని హరించి, ఎన్నికలు నిర్వహించకుండా బెదిరింపులకు పాల్పడి ఏకగ్రీవాలు చేయించిన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. అయితే ప్రజాపాలన ప్రభుత్వంలో ఎలాంటి బెదిరింపులు లేకుండా, పూర్తిస్థాయిలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించ బడుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాభిమానం కాంగ్రెస్ పార్టీ వైపే ఉందని పేర్కొన్న మంత్రి, 85 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చివరగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క సమక్షంలో 300 మంది కాంగ్రెస్‌లో చేరిక



ఆసిఫాబాద్,టౌన్ పిబ్రవరి 11 ప్రజా జ్యోతి: ఆసిఫాబాద్ మండలంలోని మోవాడ్ గ్రామపంచాయతీ పరిధి చెల్కగుడా గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సమస్యల సభ కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలకు వేదికైంది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇండిపెండెంట్‌గా గెలుపొందిన మోవాడ్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొర్కాట సుష్మ, ఉపసర్పంచ్ ఆత్రం నీలాబాయితో పాటు సుమారు 300 మందికి పైగా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సుగుణక్క కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచే పార్టీ అని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమం, ఆదివాసీ గూడాల పురోగతే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అనేక గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ముఖ్యంగా ఆదివాసీ గూడాల్లో మౌలిక సదుపాయాల కొరత, తాగునీటి సమస్యలు, రోడ్ల లేమి, యువతకు ఉపాధి అవకాశాల కొరత తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపడితేనే గ్రామ సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని, స్థానిక నాయకత్వంతో కలిసి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మోవాడ్‌లో జరిగిన భారీ చేరికలు ప్రజల్లో మార్పుకు సంకేతమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆత్రం నగరావు, కోర్కాట ప్రకాష్, మాడవి లక్ష్మణ్, సిడం పోత, కోర్కెట లింగు, టేకం జైతు, ఆత్రం ఆనందరావు, ఆత్రం అంబరావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా:ఎస్పీ



ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11 (ప్రజాజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తిస్థాయిలో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. బుధవారం ఉదయం నుంచే కాగజ్‌నగర్ పట్టణంలోని అన్ని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ నితికా పంత్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల భద్రతా ఏర్పాట్లను ఎఎస్పీ చిత్తరంజన్ పర్యవేక్షించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకొని, పటిష్ఠమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి, విజయవంతంగా ఎన్నికలు ముగించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. మొత్తం ఎన్నికల నిర్వహణలో భాగంగా సుమారు 800 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించారని పేర్కొన్నారు. అదేవిధంగా 9 స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, 10 రూట్ మొబైల్ వాహనాలు నిరంతరం పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షించాయని తెలిపారు.



# కార్మిక చట్టాలను కాలరాసేదికేంద్రప్రభుత్వము

చింతలమానేపల్లి:ఫిబ్రవరి 12,(ప్రజాజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె దేశంలో ఉన్న కార్మికులు తమ హక్కుల కోసం కార్మిక చట్టాల కోసం అహర్నిశలు పోరాడుతున్నారు కనీస వేతనాలు లేక శ్రమకు గురవుతున్నారు ఈ దేశ ఉత్పత్తి ఇదే అభివృద్ధి కార్మికుల శ్రమతోటే అలాంటి కార్మికుల పై బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ తీసుకువచ్చి ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కార్మిక శ్రమను అప్పజెప్పాలని చూస్తుంది, దాన్ని ఈ దేశంలో ఉన్న కార్మిక శక్తులు తిప్పి కొట్టాల్సిన అవసరం ఉంది , ఒకపక్క దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఉపాధి అవకాశాలు కల్పించకుండా దేశంలో మత కుల ప్రాంత భేదాలతో ప్రజలను ఇచ్చిన చేస్తుంది బిజెపి ప్రభుత్వరంగ సంస్థలని ప్రవేట్ పరం చేయాలని కోరుకుంటూ భూములని కార్పొరేషన్ శక్తులకు వ్యక్తులకు అప్పజెప్పాలని పన్నాగం పన్నుతుంది వీటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఈరోజు దేశంలో ఉన్న ప్రజలు కార్మిక కర్షక రైతు ఉద్యోగ విద్యార్థి యువకులపై ఉంది, అని,కృష్ణమాచారి, కారోబారి విలాష్ అన్నారు, దేశంలో కార్మికులందరూ ఏకం కావాలి. స్కీమ్ ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండలం అధ్యక్షులు శ్రీలత, కార్యదర్శి డోర్ల కర్ విలాష్, జీపీ కార్మిక సంఘ అధ్యక్షులు బానోత్ విలాష్, ఆశా వర్కర్లు మండలం అధ్యక్షులు నిర్మల, మధ్యాహ్నం భోజనకార్మికుల అధ్యక్షులు తారబాయ్, తదితరులు పాల్గొన్నారు.

# సేవతో ముందుకు మండలంలో యువ నేతకు పెరుగుతున్న ఆదరణ

జైపూర్ ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి: జైపూర్: కేవలం తన పుట్టినరోజుకే సంచలనం సృష్టిస్తున్నాడనే విమర్శలకు భిన్నంగా, ప్రజల సమస్యలను తన సమస్యలుగా గుర్తించి నిత్యం సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న ఓ యువ నాయకుడు జైపూర్ మండలంలో విశేష ఆదరణ పొందు తున్నాడు. వ్యక్తిగత ప్రయోజనాలకంటే సామాజిక బాధ్యతను ప్రాధాన్యంగా తీసుకొని పనిచేస్తున్న ఈ యువ లీడర్‌కు మండలంలోని పలు గ్రామ పంచాయతీల ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. గ్రామాల్లో చిన్నచిన్న సమస్యల నుంచి అత్యవసర అవసరాల వరకు ప్రజలు నేరుగా ఆయనను ఆశ్రయించడం గమనార్హం. సహాయం కోసం తన నివాసానికి వచ్చే వారిని ఎలాంటి రాజకీయ భేదాభిప్రాయాలు లేకుండా ఆత్మీయంగా స్వాగతించి, సమస్యలను శ్రద్ధగా విని వెంటనే స్పందించడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది. పింఛన్ల మంజూరు, రేషన్ కార్డుల సమస్యలు, విద్యార్థులకు ఫీజు సాయం, వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం, విద్యుత్ తాగు నీరు రహదారుల వంటి మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులతో చర్చించి పనులు పూర్తి చేయించడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటు న్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లోనూ ఆయన చురుకుదనం స్పష్టంగా కనిపిస్తోంది. స్వచ్ఛత కార్యక్రమాలు, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు, యువతకు ఉపాధి మార్గదర్శక శిబిరాలు, విద్యార్థులకు కెరీర్ అవగాహన సదస్సులు నిర్వహిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేస్తున్నారు. దీంతో యువత పెద్ద సంఖ్యలో ఆయన సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్నారు. అడిగితే వెంటనే స్పందిస్తారుడ ఎప్పుడూ అందుబాటులో ఉంటారు అంటూ పలు గ్రామాల ప్రజలు ఆయన సేవలను ప్రశంసిస్తున్నారు. రాజకీయ పదవి లేకపోయినా ప్రజల కోసం నిరంతరం కృషి చేయడం ద్వారా ప్రత్యేక గుర్తింపు సాధించారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా యువతలో ఆయనపై విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని మండల రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామ పంచాయతీల ప్రజలు ఇలాంటి సేవాభావం కలిగిన నాయకత్వం భవిష్యత్తులో మరింత అవసరమని భావిస్తున్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా స్వీకరించి ముందుకు సాగుతున్న ఈ యువ నాయకుడి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి మండల అభివృద్ధికి దోహదపడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# జోరందుకున్న క్యాంపు రాజకీయాలు

ఈ సర్వేలు ఎంతవరకు ఫలితాలకు అనుగుణంగా ఉంటాయన్న అంశాన్ని పక్కనపెడితే, ఆయా అంచనాలను ఆధారంగా చేసుకొని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. పోలింగ్ ముగిసిన సాయంత్రం నుంచే కౌంటింగ్‌కు ముందే అభ్యర్థులను ఇతర పార్టీల ఆకర్షణ నుంచి కాపాడుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

**మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరంగా......**

చూస్తే మంచిర్యాల కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ 35 నుంచి 45 కార్పొరేటర్ స్థానాలు గెలుచుకుంటుందని, మేయర్ పీఠం కాంగ్రెస్ వశమవుతుందని దాదాపు అన్ని సర్వేలు స్పష్టం చేశాయి. అదే విధంగా టీఆర్ఎస్ పార్టీకి 8 నుంచి 15 స్థానాలు, బీజేపీకి కూడా టీఆర్ఎస్ స్థాయిలోనే కొన్ని ఎక్కువ ,తక్కువ కార్పొరేటర్ స్థానాలు దక్కనున్నాయని, ఒక స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని సర్వే అంచనాలు చెబుతున్నాయి. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ఓటర్లు తమ పార్టీ అభ్యర్థులకే మద్దతు ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఎలాంటి అనుకోని పరిణామాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా అభ్యర్థులను రహస్య క్యాంపులకు తరలించినట్లు సమాచారం లీక్ అవుతోంది. ఇదే తరహాలో బీజేపీ పార్టీ నాయకులు తమ అభ్యర్థులను తడోబా ప్రాంతంలో ఏర్పాటు చేసిన క్యాంపులకు తరలించినట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్ పార్టీ కూడా గెలిచిన అభ్యర్థులు ఇతర పార్టీల వైపు మొగ్గు చూపకుండా జాగ్రత్తలు తీసుకుంటూ క్యాంపులకు తరలించినట్లు సమాచారం. క్యాంపుల్లో ఉన్న అభ్యర్థులకు ఈ నెల 16 వరకు అన్ని సకల సౌకర్యాలు కల్పించినట్లు తెలిసింది. ఎందుకంటే అదే రోజున మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులు 'చే జారకుండా' అప్రమత్తంగా వ్యవహరిస్తున్నా యన్నది స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఫలితాలకు ముందే ఇలా జోరందుకున్న క్యాంపు రాజకీయాలు ఓటర్లను విస్మయానికి గురిచేస్తున్నాయన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా, ఈ ఎన్నికల్లో సర్వేలు చెప్పిన అంచనాలు నిజమవుతాయా లేదా అన్నది నేడు సాయంత్రం లోగా వెలువడే అధికారిక ఫలితాలతో స్పష్టమవనుంది.

# నాలుగు లేబర్ కోడ్ చట్టాలను ఉపసంహరించుకోవాలి

**వాంకిడి ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి ):** తిర్యాణి మండలం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను ఉపసంహరించుకోవాలని, సీఐటీయూ కార్మిక సంఘాల డివైఎఫ్ఐ యువజన సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు అనంతం కొమరం భీమ్ చౌరస్తాలో నిరసన తెలియజేశారు. సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టీకానంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ చట్టాల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లి అవకాశం ఉందని తెలిపారు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాల వల్ల కార్మిక హక్కులు కాల రాయబడతాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. స్వతంత్రం పూర్వం ఎన్నో త్యాగాలతో పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారువిద్యుత్ సవరన్న బిల్లు 2025 ను ఉపసంహరించుకోవాలి విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి నూతన జాతీయ విత్తన చట్టాన్ని రద్దు చేయాలి కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి కార్మికుల కనీస వేతనం 26,000 ఇవ్వాలి అన్నారు నూతన విద్యా విధానాన్ని రద్దుచేసి ఉచిత విద్యా హక్కు ఆరోగ్య హక్కు పరిశుద్ధ నిరు అందుబాటులోకి తేవాలి అన్నారు నాలుగు లేబర్ కోడ్ వల్ల కార్మికులకు రక్షణ ఉండదు సమ్మె చేసే హక్కు ఉండదు ప్రశ్నించే అధికారం ఉండదు అన్నారు



కార్మికులకు ఎనిమిది గంటల పని కి బదులు12 గంటల పనిబరం పడుతుందని అన్నారు దేశ సంపాదన కొద్దిమంది చేతుల్లో ఉంటుంది దేశ ఆర్థిక విధానాలకు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకంగా వ్యవహరిస్తుంది అన్నారు కార్మికుల ఆవేదన కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలి అన్నారు ప్రజాస్వామ్యంలో చట్టాలను కేవలం పెట్టుబడి దారులకు కోసం కాకుండా కార్మికుల సంక్షేమానికి ఉండాలని ప్రభుత్వం గుర్తు చేసుకోవాలి అన్నారు కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గుండం శంకర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, పెరుమాండ్ల వెంకటేశం గౌడ్,బుద్దే విజయ్, కారోబరు సంఘం గౌరవ అధ్యక్షులు సుద్దాల తిరుపతి, అధ్యక్షులు జంగు, మధ్యాహ్న భోజన సంఘాల నాయకులు, చంద్రకళ అంగన్వాడి నాయకుల ఆత్రం పార్వతి ఆశా వర్కర్, ఆత్రం బద్రు బాయ్ పరిశుద్ధ కార్మికులు అడ లక్ష్మణ్ చిలుక రవి ఆత్రం మారుతి రాము సురేష్ వేముల రాజ్ కుమార్ గోల్కొండ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# శివపార్వతుల కళ్యాణ మహోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

**ఆసిఫాబాద్ టౌన్ ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి:** ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్‌నగర్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ గురువారం ఆవిష్కరించారు. పట్టణంలోని శ్యామ్ నాయక్ క్యాంపు కార్యాలయంలో ఉత్సవ ఆహ్వాన కమిటీ సభ్యులు ఆయనను కలిసి కళ్యాణోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం పోస్టర్లను విడుదల చేసిన శ్యామ్ నాయక్ మాట్లాడుతూ లోకకళ్యాణం కోసం నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఇటువంటి వేడుకలు సమాజంలో సౌహార్ద వాతావరణాన్ని నెలకొల్పడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామగిరి అశోక్, రాపర్తి శంకర్, రాపర్తి మురళి, రాపర్తి అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వాంకిడి ఉపసర్పంచ్ దీపక్ ముండే తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు జైపూర్ విద్యార్థి ఎంపిక



**జైపూర్ ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి :** జైపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గణేష్ రాష్ట్రస్థాయి అండర్17 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానో పాధ్యాయులు పి. శ్రీనివాస్ వెల్లడించారు. ఈనెల 13 నుండి 15 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించ నున్న రాష్ట్రస్థాయి అండర్17 క్రికెట్ పోటీలలో గణేష్ పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గణేష్ జైపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి అభ్యసిస్తున్నాడు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ ప్రదర్శించే అవకాశం దక్కడం పాఠశాలకు గర్వకారణమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గణేష్ ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రస్థాయిలోనూ మెరుగైన ప్రదర్శనతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి ఇద్దరికి తీవ్ర గాయాలు



**జైపూర్ ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి :** జైపూర్ మండలంలోని రసూల్ పల్లి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది,జగిత్యాల జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు స్థానిక ఎస్సై రాజశేఖర్ తెలిపారు.మేడిపల్లి గ్రామానికి చెందిన తూర్పాటి అభి (19) తన స్నేహితులు పురాణం రవి (22), పస్తం అరుణ్ (22) లతో కలిసి పత్తికూలి పనుల కోసం ఫిబ్రవరి 11న సాయంత్రం చెన్నూరుకు వెళ్లగా పని ముగించుకొని ముగ్గురు కలిసి ఏపీ-15 డీజీ-7741 నంబరు గల హోండా యూనికార్న్ మోటార్ సైకిల్‌పై ఫిబ్రవరి 12 తెల్లవారు జామున 4 గంటలకు చెన్నూర్ నుండి లక్షెట్టిపేటకు బయలుదేరగా. గురువారం ఉదయం సుమారు 5:30 గంటల సమయంలో ఇందారం ఎక్స్ రోడ్ మరియు రసూల్‌పల్లి మధ్య మోటార్ సైకిల్ ఓవర్ స్పీడ్ కారణంగా అదుపుతప్పి ద్విచక్ర వాహనంతో డివైడర్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తూర్పాటి అభికి తలపై తీవ్ర గాయం తగలడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. గాయపడిన పురాణం రవి, పస్తం అరుణ్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు.మృతుని తండ్రి తూర్పాటి అంజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జైపూర్ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మహా శివరాత్రి సందర్భంగా బుగ్గ రాజేశ్వర స్వామి కల్యాణోత్సవానికి ఆహ్వాన పత్రిక విడుదల

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 12 ప్రజాజ్యోతి:** మహా శివరాత్రి వైభవాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న స్వామివారి దర్శనం, కల్యాణోత్సవానికి సంబంధించి ఆహ్వాన పత్రికల ఆవిష్కరించారు ఈ సందర్భంగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి మండల తహసిల్దార్ కృష్ణ, ఆర్ఐలు ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మాజీ జెడ్పిటిసి బెల్లంపల్లి కారుకూరి రామచందర్, నాతరి స్వామి లకు కల్యాణోత్సవ ఆహ్వాన పత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో కారుకూరి రామచందర్, నాతరి స్వామి చేతుల మీదుగా కల్యాణోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..



# ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన చెక్ పంపిణీ కార్యక్రమం



**తాండూర్ ఫిబ్రవరి 12 ప్రజాజ్యోతి:** తాండూర్ ంఎఆ బ్యాంకు మరియు భీమిని సి.ఎఫ్.ఎల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద చెక్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారుడి నామినీ కొంపల్లి భీమయ్య గారికి రూ.2 లక్షల విలువైన చెక్కును తాండూర్ టీజీబీ బ్యాంకు మేనేజర్ అవినాష్ గారు మరియు ఆర్ బి ఐ, సి ఫ్. ల్ కౌన్సిలర్ ఎన్నం. అశోక్ , రవి, ధ్ఘుఅని సిబ్బంది , అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ అవినాష్ మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి ఉండటం అవసరం. ముఖ్యంగా ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.2000తో పాలసీ తీసుకుంటే ప్రమాద మరణం జరిగితే నామినీకి రూ.40 లక్షల పరిహారం అందుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ ఇన్సూరెన్స్ చేసుకోవాలి" అని తెలిపారు.సి ఫ్ ల్ కౌన్సిలర్ అశోక్ మాట్లాడుతూ, "18 నుండి 70 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన,18 నుండి 50 లోపు వారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలలో చేరాలి. ఏ. పీ .వై ఇవి కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించే పథకాలు" అని సూచించారు అలాగే ఖాత కలిగి 10 సంవత్సరాలు పూర్తయిన అందరూ రీ. కె .వైసీ. చేసుకోవాలని, ఆర్.బి.ఐ., డి .ఈ.ఏ .ఫ్. ఫండ్ గురించి అందరూ అవగాహన పెంచుకోవాలని 1.84 లక్షల కోట్లు ప్రజల డబ్బులు క్లెయిమ్ చేసుకోకుండా బ్యాంక్ ల వద్ద ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది అని వాటిని సరైన పద్ధతి లో మీ డబ్బులు మీరు తిరిగి పొందొచ్చు అని అన్నారు.ద ఖాత లో డబ్బులు వేసి కానీ లేదా పెట్టుబడులు పెట్టి కానీ ఇన్సూరెన్స్ డబ్బులు క్లెయిమ్ ఐ పొందని వి 10 సంవత్సరాలు ఉపయోగించకుండా వదిలేస్తే అవి ఆర్. బి .ఐ. డి .ఈఏ. ఫండ్ కి బదిలీ చేయబడతాయి ,ఇలా బ్యాంక్స్, సెబీ, ఐ ఆం డఏఐపీ .ఫ్ .ఆర్ .డి .ఏ. వద్ద 1.84 లక్షల కోట్ల రూపాయలు ఉన్నాయి అని వాటిని పొందడానికి ఆర్. బి. ఐ., ఉద్గమ్ పోర్టల్ ని తీసుకొని వచ్చింది, కాబట్టి అలాంటి పాత ఖాతాలు ఉన్న వారు ఒకసారి బ్యాంక్ లో కానీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రంలో కానీ ఉద్గామ్ పోర్టల్ లో కానీ చెక్ చేసుకోవచ్చు ఈ ప్రకీయ లో సి. ఎఫ్.ల్., కౌన్సిలర్స్ మీకు సహాయం చేస్తారు. కాబట్టి మీ డబ్బు మీ హక్కు అని ప్రభుత్వం కూడా కార్యక్రమలు చేస్తున్నాయి అన్నారు అందరూ బ్యాంక్ కి సంబంధించిన ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సింగరేణి సంస్థ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్



**సింగరేణి భవన్ లో స్వాగతం పలికిన సింగరేణి డైరెక్టర్లు**



**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీగా నియుక్తులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం ఉదయం హైదరాబాద్ సింగరేణి భవన్ లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. ఉదయం సింగరేణి భవన్ కు విచ్చేసిన ఆయనకు సంస్థ జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ – మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్ స్వాగతం పలికారు. అనంతరం ఛైర్మన్ కార్యాలయంలో అధికారిక బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్. వి సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు డైరెక్టర్ (పర్సనల్ , ఫైనాన్స్) గౌతం పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి. వెంకన్న ఛైర్మన్ కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు సింగరేణి సంస్థ పైన సంక్షిప్తంగా వివరించారు. డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ 2002 బ్యాచ్ కి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ఇప్పటివరకు ఆయన తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా పని చేశారు. గతంలో రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శిగా విశిష్ట సేవలు అందించారు. అంతకుముందు సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో కూడా వివిధ హోదాల్లో పని చేశారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ గానూ, భద్రాచలం ఐటిడిఏ పీఓగా కూడా బాధ్యతలు నిర్వహించారు. సీనియర్ అధికారిగా పేరున్న డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ సింగరేణి సంస్థ ఛైర్మన్ గా బాధ్యతలను స్వీకరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది





# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**బెల్లంపల్లి ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన, సమయానుకూల వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం జిల్లాలోని కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన వార్డులు, మందుల నిల్వలు, ఆసుపత్రి పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది విధుల పట్ల కట్టుబడి సమయపాలన పాటించాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, సామాగ్రి సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలో భోజనశాల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు

# నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే వెనక్కి తీసుకోవాలి: కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్

**కార్మిక హక్కులపై కేంద్రం దాడి: కలెక్టరేట్ ఎదుట నిరసన**

**లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే పోరాటం ఉధృతం: దినకర్ హెచ్చరిక**

**ఆసిఫాబాద్ టౌన్ పిబ్రవరి 12 ప్రజా జ్యోతి :** జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట ఈ రోజు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులపై యుద్ధం ప్రారంభించిందని విమర్శించారు. 2019 నుండి ఈ విధానాలు అమలులోకి తీసుకువచ్చి కార్మిక హక్కులను బలహీనపరిచే చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ కోడ్స్ యజమానులకు అనుకూలంగా ఉండేలా రూపొందించబడినవని, చట్టబద్ధ హక్కులను క్షీణింపజేస్తాయని ఆరోపించారు. కోడ్స్ రూపంలో చట్టాలను తీసుకురావడం వల్ల ప్రభుత్వాధికారులు అవసరానుసారం మార్పులు చేయగల అవకాశముందని ఆయన అన్నారు. ఈ కోడ్స్ అమలైతే దేశంలో శాశ్వత ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతుందని, యజమానులు అవసరమైనప్పుడు నియమించుకొని, అవసరం లేకపోతే తొలగించే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. దీనినే "హైర్ అండ్ ఫైర్" విధానం అని పేర్కొన్నారు. ఇది కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే విధానమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా గత ఐదేళ్లుగా కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, మేధావులు దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చాయని చెప్పారు. కార్మిక హక్కులను కాపాడాలంటే నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని దుర్గం దినకర్ స్పష్టం చేశారు. లేదంటే భవిష్యత్తులో కార్మికులు వెట్టిచాకిరికి గురయ్యే పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



# ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ): మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఫలితాలు ప్రకటించేందుకు కఠినమైన మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, అలాగే మంచిర్యాల జోన్‌లోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోదావరిఖని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, లైటర్లు వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్లోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు పూర్తిగా అనుమతి లేదని, బాణాసంచా మరియు డీజేలను నిషేధించినట్లు స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు, కౌంటింగ్ ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. భద్రతా బలగాల వివరాలు– డీసీపీలు 2, అడిషనల్ డీసీపీ 1, ఏసీపీలు 7, సీఐలు 33, ఎస్ఐలు 96, ఏఎస్ ఐలు / హెడ్ కానిస్టేబుళ్లు 149, కానిస్టేబుళ్లు 518, హోంగార్డులు 113, స్పెషల్ పార్టీ, ఆర్మ్ సిబ్బంది 158 అని మొత్తం సుమారు 1075 మంది పోలీస్, భద్రతా సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## జిల్లాస్థాయి సి ఎం కప్ ఆటల పోటీలు ప్రారంభం

మంచిర్యాల, 12, ఫిబ్రవరి (ప్రజా జ్యోతి ): సిఎం కప్2025లో భాగంగా మంచిర్యాల జిల్లాస్థాయి క్రీడా పోటీలు గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంత రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచే యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ప్రభుత్వం సి ఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నదని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో పోటీలు పూర్తి చేసిన అనంతరం జిల్లాస్థాయి పోటీలను నిర్వహి స్తున్నామని చెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండల విద్యాధికారి శ్రీనివాస్, డీసీబీఈ ఇంచార్జ్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రమేష్, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎండి. యాకూబ్, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ రాజేష్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు రేణి రాజయ్య, కె. రామ్మోహన్ రావు, సూర సుదర్శన్, సిరంగి గోపాల్, బండి రవి, గాజుల శ్రీనివాస్, బెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఆర్. శ్రీనివాస్ రెడ్డి, విఠల్, సంతోష్, విజయ్, నందం శ్రీనివాస్, కె. జ్యోతి, సాగర్, రోజీ వరకుమారి, ఎ. వరలక్ష్మి, గుమాస వరలక్ష్మి, దాసరి మల్లేష్, తిరుపతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి పోస్టర్ల విడుదల

ఆసిఫాబాద్ టౌన్ ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి: బంజారా సమాజ ధర్మగురు, క్రాంతికారి మహాయోగి శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల సందర్భంగా వాల్ పోస్టర్లను గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో ఘనంగా విడుదల చేశారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గ దర్శకుడిగా, సమానత్వం మరియు న్యాయం కోసం పోరాడిన మహనీయుడిగా చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17న ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రేమల గార్డెన్‌లో 287వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బంజారా సమాజ ప్రతి నిధులు, ప్రజాప్రతి నిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యాంనాయక్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంజారా సమాజ పెద్దలు పాల్గొన్నారు.





## క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయి

తాండూర్ ఫిబ్రవరి 12 ప్రజాజ్యోతి: క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దారుఢ్యానికి, స్నేహ సౌభ్రాతృత్వం పెంపొందించుకోవడం కోసం ఎంతో ఉపయోగపడతాయని చౌటపల్లి సర్పంచ్ ముదాం సునీత, తాండూర్ మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి అన్నారు. తాండూర్ మండలం చౌటపల్లి గ్రామంలో కీర్తిశేషులు మాసాడి విష్ణువర్ధన్ స్మారక క్రికెట్ పోటీలను వారి కుటుంబ సభ్యులు, నిర్వాహకులు గురువారం నిర్వహించారు. ఈ క్రికెట్ పోటీలను ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని, క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని, క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయని సోదర భావంతో క్రీడలలో పాల్గొనాలని ఎలాంటి గొడవలకు తావివ్వకుండా జరుపుకోవాలని కోరారు. చౌటపల్లి, అంకుశం, బోయపల్లి, ద్వారకాపూర్, కాసిపేట ఐదు గ్రామపంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో మొత్తం 6 ఫ్రాంచైజెస్ టీంలు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడ పోటీలు 7 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పోటీలలో విన్నర్ జట్టుకు పదివేల రూపాయల నగదు తో పాటు షీల్డు, రన్నర్ జట్టుకు 8 వేల రూపాయల నాగుతో పాటు షీల్డు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు మాసాడి శశివర్ధన్, చాందా సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాసాడి శ్రీరాములు, మాసాడి తిరుపతి, ముదాం రఘు, సుందిళ్ళ భూమయ్య, డిటి రావు, చీమల రాయలింగు, బైరి శ్రీను, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## సహస్రాధిక సప్తాహకులు పరాంకుశాచార్యులు మృతి.

లక్షెట్టిపేట ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి): శతాధిక వయోవృద్ధులు సహస్రాధిక భాగవత సప్తాహకులు మందపల్లి పరాంకుశా చార్యులు (103) పరమపదం చెందాడు. లక్షెట్టిపేట వాస్తవ్యులు అయిన పరాంకుశా చార్యులు గ్రామం లోని అత్యంత మహిమాన్వితమైన జగన్నాథ చార్యుల ఆలయంలో వంశపారంపర్య అర్చకులుగా దాదాపు ఎనభై ఐదు సంవత్సరాలుగా సేవలను అందించారు. వేయికి పైగా భాగవత సప్తాహాలను రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఆలయాల్లో పట్టణాలలో చేసి కీర్తి ఘడించారు. అమరాకోశము చిన్ననాటనే కంఠస్తాము చేసి కోరుట్ల లో సంస్కృత పాఠశాల యందు తొలి శతావధాని శిరీశిహల్ కృష్ణమాచార్యులు వద్ద సంస్కృతం పురాణ ఇతిహాసాలను నేర్చుకున్నారు. తిరుప్పావు తిరుమంత్రార్థం శ్రీవచన భూషణం లాంటి సాంప్రదాయ గ్రంథాలను ప్రవచనం చేయడంలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి గడించారు. ఎన్నో పురాణాలను ప్రవచించిన ఆయన ఎలాంటి అనారోగ్యం లేకుండా జీవించారు. వయసు రీత్యా గత కొంత కాలంగా హైదరాబాద్ లోని తన కుమారుడు ఇంట్లో వుంటున్నారు. గురువారం స్వల్ప అనారోగ్యం ఏర్పడటంతో ఆసుపత్రి కి తరలించిన ఫలితం లేకుండా పోయింది. స్వగ్రామంలోనే అంత్యక్రియలు జరుగాలన్న వారి కోరిక మేరకు గురువారం సాయంత్రం గోదావరి తీరాన సాంప్రదాయంగా అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు శిష్యులతో పాటు ధర్మపురి పండితులు, స్థానికులు బ్రాహ్మణులు గ్రామస్తులు అంతిమయాత్ర లో పాల్గొని నివాళులు అర్పించారు.





# కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి: గాడిసెల కార్తీక్

లేబర్ కోడ్స్ ప్రైవేట్ శక్తులకు కార్మికులను అప్పజెప్పే ప్రయత్నం

కార్మికులు, రైతులు, యువత ఏకమై పోరాటం చేయాలి

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేయడం వ్యతిరేకంగా డివైఎఫ్ఐ ఉద్యమం



**ఆసిఫాబాద్ టౌన్ ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి :** దేశవ్యాప్తంగా కార్మికులు తమ హక్కుల కోసం నిరంతర పోరాటంలో ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులను ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతున్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గాడిసెల కార్తీక్ అన్నారు. అతని మాటల్లో, "కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరంగా మార్చి, ఉద్యోగ అవకాశాలను తగ్గిస్తూ, భూములు మరియు ఇతర వనరులను ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తోంది. ఈ విధమైన విధానాలను తిప్పి కొట్టడం కోసం దేశంలోని కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత ఏకంగా ఉండాలి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ మరియు సహాయ కార్యదర్శి వడ్లురి శ్రీకాంత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, అన్ని కార్మికులు ఏకమై పోరాటం చేయాలని పిలుపు ఇచ్చారు.

# బూరుగూడలో మహా శివరాత్రి జాతర మహోత్సవం

డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు ఆహ్వాన పత్రిక అందజేత



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామంలోని శ్రీ శివ పంచాయతన క్షేత్రంలో ఈనెల 15న నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర మహోత్సవానికి సంబంధించి ఆహ్వాన పత్రికను జాతర నిర్వహణ కమిటీ సభ్యులు డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యాంనాయక్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఇరుకుల మంగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ..మహా శివరాత్రి పర్వదినం భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన వేడుక అని పేర్కొన్నారు. బూరుగూడ గ్రామంలో నిర్వహించబడుతున్న జాతర మహోత్సవం భక్తులను ఐక్యంగా కలుపుతూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొంది స్తుందని తెలిపారు. జాతర విజయవంతం కావాలని, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు జాతర నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జాముల్ ధారలో ఉద్రిక్తతపై కలెక్టర్ సందర్శన సుగుణక్క చొరవతో గ్రామస్తులకు భరోసా



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** లింగాపూర్: కుంరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం జాముల్ ధార గ్రామపంచాయతీ పరిధిలోని మోతిగూడ, నాయక్‌పోడ్ గూడ గ్రామాల్లో బోరింగ్ మోటర్ పనుల వివాదంపై జిల్లా కలెక్టర్ కె. హరిత గురువారం గ్రామాన్ని సందర్శించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క చొరవతో కలెక్టర్ గ్రామానికి వచ్చి గ్రామస్తులతో నేరుగా సమావేశమయ్యారు. అటవీ, రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ గ్రామస్తుల సమస్యలను వివరంగా విన్నారు. తాగునీటి సమస్య తీవ్రతను గుర్తించి చట్టపరమైన పరిమితుల్లో శాశ్వత పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అటవీ కోర్ ఏరియా నిబంధనలను పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. గ్రామస్తుల ప్రాథమిక అవసరమైన తాగునీటి సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని, ఆదివాసీల హక్కులు కాపాడుతూ అభివృద్ధి పనులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గ్రామంలో రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్ తదితర సమస్యలపై కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. లిఅర్ధరాత్రి జరిగిన ఉద్రిక్తత తర్వాత సుగుణక్క జోక్యంతో పరిస్థితి సర్దుమణిగిన విషయం తెలిసిందే. ఆమె చొరవతోనే కలెక్టర్ స్వయంగా గ్రామాన్ని సందర్శించడం జరిగింది. లిఈ కార్యక్రమంలో అటవీ, రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర పంచాయత్ రాజ్ టీచర్స్ యూనియన్ ఆవిర్భావం...



**చింతలమానేపల్లి:ఫిబ్రవరి 12,(ప్రజాజ్యోతి):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్ర పంచాయత్ రాజ్ టీచర్స్ యూనియన్ ఆవిర్భావ సందర్భంగాజిల్లాలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కుమురం భీమ్ జిల్లా స్థాయిలో నిర్వహించిన టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఐ టి డి ఏ బెజ్జూర్ టీచర్స్ జట్టు ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. గెల్పొందిన జట్టులకు గోలేటి సింగరేణిజనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయత్ రాజ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటుకూరి శ్రీనివాస్, క్రీడల నిర్వాహకులు జాడి జ్ఞానేశ్వర్ , అనిల్ ,క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్.



**లక్షెట్టిపేట ఫిబ్రవరి 12, (ప్రజాజ్యోతి):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 9 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీకి సంబంధించి 15 వార్డులకు గాను 8 టేబుల్స్ ఏర్పాటు చేసి 2 రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# కేంద్రం నాలుగు లేబర్ కోడ్స్ ప్రవేశంపై సీఐటీయూ నిరసన

**కెరమెరి ఫిబ్రవరి 12 ప్రజా జ్యోతి:** కెరమెరి మండల కేంద్రం లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. సీఐటీయూ మండల కన్వీనర్ కూటికెల ఆనంద్ రావు కేంద్ర ప్రభుత్వంపై కఠిన విమర్శలు గుప్పించారు. గత 11 సంవత్సరాల్లో కేంద్రం కార్పొరేట్ యాజమానుల జేబులు నింపేందుకు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్లుగా మార్చిందని ఆయన తెలిపారు. ఆయన హెచ్చరించినట్లుగా, ఈ చర్యల వల్ల స్వాతంత్ర్యం వచ్చిన 76 సంవత్సరాల తర్వాత కూడా కార్మికులు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత పొందలేకపోతున్నారు. 2005లో వామపక్షాల పోరాట ఫలితంగా పాస్ అయిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల జీవితాలు మెరుగ్గా మారినప్పటికీ, ప్రస్తుత కేంద్రం ఉపాధి హామీ పనులను రద్దు చేయడం వల్ల పేదల కడుపులు మడుస్తున్నాయి అని ఆయన ఆరోపించారు. ఉద్యోగ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని కూడా తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐకెపి అంగన్వాడి మధ్యాహ్న భోజన గ్రామపంచాయతీ ఆశ వర్కర్లు అనిశెట్టి రమేష్, జాదవ్ అనసూయ, తిరుసుల్ల సంతోష్, సావిత్రి, మంజుల, రఘునాథ్, రాందాస్, స్వామి, శ్రీనివాస్, వినేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్లు విడుదల

**డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్: బంజారా సమాజ ధర్మగురు, క్రాంతికారి మహాయోగి శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల సందర్భంగా వాల్ పోస్టర్లను గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో ఘనంగా విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గం ఇంచార్జి అజ్మీరా శ్యాంనాయక్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఇరుకుల మంగ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ గారు బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా, సమానత్వం, న్యాయం కోసం పోరాడిన మహనీయుడిగా నిలిచారని తెలిపారు. వారి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17 మంగళవారం రోజున ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రేమల గార్డెన్‌లో 287వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బంజారా సమాజ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంజారా సమాజ పెద్దలు పాల్గొన్నారు. అజ్మీరా.శ్యామ్ నాయక్ చేతుల మీదుగా సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల గోడ ప్రతుల ఆవిష్కరణ బంజారాల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల పోస్టర్లను లిఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న ఈ మహోత్సవానికి సంబంధించి, ఉత్సవ కమిటీ సభ్యులు శ్యామ్ నాయక్ గారిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు జయంతి ఏర్పాట్ల గురించి ఆయనకి వివరించారు.అనంతరం శ్యామ్ నాయక్ చేతుల మీదుగా జయంతి ఉత్సవాల గోడ ప్రతులను కమిటీ సభ్యులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ..సమాజంలో అహింస, భక్తి మరియు సామాజిక మార్పు కోసం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని కొనియాడారు. బంజారా సంస్కృతికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఈ జయంతి వేడుకలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ కి సూచించారు. ఉత్సవ గౌరవ అధ్యక్షుడు రాథోడ్.శంకర్ నాయక్,చైర్మన్ చవాన్. గుణవంత్ రావు,ప్రధాన కార్యదర్శి రాథోడ్. రూప్లాల్, రాథోడ్. శేషారావు, బదావత్. అంబాజీ, ధారావత్.ధన రాజు,భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ గణపతి ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు

**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** మంచిర్యాల పట్టణంలోని హమాలి వాడలో గల శ్రీ లక్ష్మీ గణపతి ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 14న ఉదయం 6 గంటల నుంచి గణపతి పూజ, అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి, మహా నైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు జరుగనున్నాయి. సాయంత్రం 6 గంటలకు శివనామ స్మరణతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 15న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిరంతర అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు శివపార్వతీ కళ్యాణ మహోత్సవం భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ



సందర్భంగా శివపురాణ ప్రవచనాలు, భజనలు, హరహర మహాదేవ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగనుంది. ఫిబ్రవరి 16న ఉదయం 7 గంటలకు ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఉత్సవాల ముగింపు సందర్భంగా ధ్వజావరోహణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# విద్యార్థులకు ఉన్నత విలువలు బోధించండి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** కాగజ్ నగర్ పట్టణం పెట్రోల్ పంపులో గల శ్రీ విశ్వ శాంతి రెసిడెన్షియల్ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొని ప్రసంగించిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికై అధ్యాపకులు పాటుపడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రైవేటు పాఠశాలలతో పోటీపడే పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో వచ్చినప్పుడే విద్యారంగం బలోపేతం అవుతుందని తెలిపారు. వార్షికోత్సవం జరుపుకుంటున్న విద్యార్థులు, అధ్యాపకులు మరియు పాఠశాల మేనేజ్మెంట్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, పాఠశాల కరస్పాండెంట్ లంక కృష్ణ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లాస్థాయి క్రీడాపోటీలలో బేల విద్యార్థిని ప్రతిభ

**బేల, ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి ):** అదిలాబాద్ పట్టణంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గత ఐదు రోజుల నుండి




నిర్వహిస్తున్న, జిల్లాస్థాయి సీఎంకప్ క్రీడా పోటీలలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. బేల విద్యార్థిని జి.శృతి విశిష్ట ప్రతిభ కనబర్చింది. లాంగ్ జంప్ విభాగంలో మొదటి బహుమతి, రన్నింగ్ పోటీలో రెండవ బహుమతిను అందుకుంది. విద్యార్థిని సాధించిన ఈ విజయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు వందన, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని అన్నారు.

# బెదిరింపులకు పాల్పడుతున్న విలేకరులపై కేసు నమోదు.

**జన్నారం,ఫిబ్రవరి12(ప్రజాజ్యోతి):** ప్రభుత్వం తనకు ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం ఇసుక తీసుకెళ్తున్న లబ్దిదారుడిని డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్న ముగ్గురు విలేకరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ గొల్లపెల్లి అనూష తెలిపారు.ఎస్.ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన నూనావత్ విజేశ్ అనే వ్యక్తి ప్రభుత్వం తనకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం కొత్తపేట వాగు నుండి ఇసుక తీసుకెళ్తున్న సమయంలో కవ్వాల్ గ్రామానికి చెందిన అంబటి శరత్(పోరు తెలంగాణ), తుడుం జితేందర్(జనం పవర్),కొత్తపేట గ్రామానికి చెందిన దాసండ్ల నవీన్(చార్మినార్ ఎక్స్ ప్రెస్) అనే ముగ్గురు విలేకరులు ఫోటో లు తీసి రూపాయలు 5000 ఇవ్వకపోతే అటవీశాఖ అధికారులకు పట్టిస్తామని, ఇవ్వకపోతే ఎలా బ్రతకాలో ఆలోచించుకో అని, పత్రికల్లో రాస్తామని బెదిరిస్తున్నారని నూనావత్ విజేశ్ ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ అనూష తెలిపారు.

# మంచిర్యాల కార్పొరేషన్ బిజెపి అబ్యర్తులు క్యాంపులకు తరలింపు



**మంచిర్యాల, 12, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** మంచిర్యాల కార్పొరేషన్ లో పోటీ చేసిన బిజెపి అబ్యార్తులను క్యాంపులకు తరలించిన ఫోటోలను బిజెపి విడుదల చేసింది. ఎ.సి బస్సుల్లో అబ్యర్తులను క్యాంపులకు తరలించారు. ఎంతో ఉత్సాహం తో అబ్యర్తులు తరలివెల్లిన క్యాంపు వద్ద కనిపించారు. అంతే కాదు మంచిర్యాల కార్పొరేషన్ ఎన్నికల్లో తమదే గెలుపు అనే విధంగా సంకేతాలు పంపించారు మరి బిజెపి పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థుల్లో ఎంత మంది గెలుస్తారో ,,? ఎంతమంది గెలుపు జాతకం తెరగా బదుతుందో? నేడు జరిగే ఎన్నికల ఫలితాలు స్పష్టం చేయనున్నాయి. ఎక్కవ స్థానాల్లో బిజెపి అబ్యార్తులను గెలుచుకుని మేయర్ పీటాన్ని క్లైవసం చేసుకోవాలని అనుకుంటున్న బిజెపి పెద్దల "కల" ఏమవుతుందో చూడాలి మరి.

# అంగన్వాడి కేంద్రాల పనితీరు మెరుగుపరిచేందుకు రమేష్ మోహర్లే మద్దతు

**ఆసిఫాబాద్ టౌన్ పిబ్రవరి 12 ప్రజా జ్యోతి:** చిన్న బేండర్ గ్రామ ఉప సర్పంచ్ రమేష్ మోహర్లే గురువారం చిన్న బేండర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో వారు కేంద్రంలోని పిల్లల పోషణ, విద్యా కార్యక్రమాలు, పరిశుభ్రత పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. సందర్శన సమయంలో ఉప సర్పంచ్ రమేష్ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందిని కలుసుకున్నారు. వారు ఎదుర్కొనే సమస్యలు, చేపట్టే కార్యక్రమాలు, పిల్లల కోసం రూపొందించిన ప్రత్యేక కార్యాచరణల గురించి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది సూచించిన సమస్యలపై గుర్తింపు తీసుకుని, అవసరమైతే పంచాయతీ ద్వారా మద్దతు అందించాలని వాగ్దానం చేశారు. ఉప సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ, "అంగన్వాడి కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరచడం మా ప్రధాన లక్ష్యం. పిల్లలకు ఆరోగ్యకరమైన పరిసరాలు, సరైన పోషణ, విద్యా కార్యకలాపాలు అందించడానికి అన్ని సాధ్యమైన సాయాన్ని పంచాయతీ ద్వారా అందిస్తాం" అని తెలిపారు. వీటితో పాటు, రమేష్ మోహర్లే గ్రామంలో అంగన్వాడి కేంద్రాల ప్రమాణాల పెంపుకు సంబంధించి కొత్త మార్గదర్శకాలను అమలు చేయాలని, సిబ్బందిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక శిక్షణలతో సహకరించడంపై దృష్టి సారిస్తామని చెప్పారు.

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

**అక్రిడిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు యాజమాన్యాలు త్వరితగతిన లెటర్ ప్యాడ్ లు సహకాలంలో అందించి నిజాయితీగా వర్కింగ్ జర్నలిస్టులుగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులకు యాజమాన్యాలు తగు న్యాయం చేయాలని కార్డులు అందించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని జిల్లాలో పలువురు ఆశిస్తున్నట్లు ఎదురుచూస్తున్నట్లు సమాచారం.. సంస్థలను కంటికి రెప్పలా కాపాడుకునే వారిని యాజమాన్యాలు దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్లాలని ఆ పాత్రికేయులకె న్యాయం చేయాలని ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారందరికీ న్యాయం జరిగేనా అనేది వేచి చూడాల్సిందే? అక్రిడిటేషన్ కార్డు అందేలా రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ శ్రీమతి సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్ఓ శ్రీ జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# మహిళల ఆరోగ్యం,విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్య త్తును ప్రభావితం చేస్తుంది





**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**జైనథ్ లో ప్రగతి కార్యక్రమం ప్రారంభం**

**ఆదిలాబాద్ బ్యూరో,ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి):** మహిళల ఆరోగ్యం విద్యపై పె ట్టే పెట్టుబడి సమాజ భవిష్య త్తును ప్రభావితం చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొ న్నారు.మహిళల ఆరోగ్యం, ప రిశుభ్రత, సాధికారత లక్ష్యంగా 'ప్రగతి' కార్యక్రమాన్ని గురువా రం జైనథ్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ (టి జిఎంఎస్) జూనియర్ కళాశా లలో ప్రారంభించారు. దేశంలో ని ప్రముఖ టెలికాం మౌలిక వ సతుల సంస్థ ఇండస్ టవర్స్ తమ కార్పొరేట్ సామాజిక బా ధ్యతలో భాగంగా, పింకిషే ఫౌం డేషన్ తో కలిసి ఈ కార్యక్ర మాన్ని చేపట్టింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చే సి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల ఆరో గ్యం, విద్యపై పెట్టే పెట్టుబడి స మాజ భవిష్యత్తును ప్రభావి తం చేస్తుందన్నారు. రుతు క్ర మంపై ఉన్న అపోహలను తొల గించి కిశోర బాలికలు, మహిళ ల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు అవసరమని పేర్కొన్నారు. 'ప్రగతి' కార్యక్రమాన్ని జిల్లాలో నిబద్ధతతో అమలు చేయడం అభినందనీయమన్నారు. వి ద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుపై దృష్టి సారించి ఐఐ టీ, ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టా త్మక సంస్థల్లో అవకాశాలు సా ధించాలని సూచించారు. ఇండ స్ టవర్స్ ప్రతినిధి అరుణ్ మా ట్లాడుతూ, మహిళల ఆరోగ్య పరిరక్షణకు తమ సంస్థ కట్టుబ డి ఉందన్నారు. గ్రామీణ ప్రాం తాల్లో అవగాహన పెంచడం ద్వారా మహిళల జీవన ప్రమా ణాలు మెరుగుపడతాయని తెలిపారు.అనంతరం మోడల్ స్కూల్ కు సంబంధించి పోస్ట ర్లను ఆవిష్కరించి, ఈ సంద ర్భంగా అధికారులను కలెక్టర్ అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో శిక్షణ కలెక్టర్ సలోనిచాబ్రా, సంతోష్ రామ్, సీసీ ఈ ఓ అరుణ్, పింకి షే ఫౌండేషన్ ప్ర తినిధులు శాతిని గుప్తా, అరు ణ్ గుప్తా, జైనథ్ సర్పంచ్ మ మత, ప్రత్యూష, కళాశాల అ ధ్యాపకులు, విద్యార్థులు, తది తరులు పాల్గొన్నారు.



# సేవాలాల్ జయంతి పోస్టర్లు ఆవిష్కరించిన - బోథ్ ఎమ్మెల్యే

**బంజారా, లంబాడ సోదరులందరూ తరలిరావాలని పిలుపు**

**నేరడిగొండ ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి):** 18వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి ఉత్సవాల పోస్టర్లను ఈరోజు నెరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని గ్రామాల బంజారా, లాంబాడా సోదరులు ఉత్సవాలకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమాజం యొక్క కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ భీంరావ్ నాయక్, అధ్యక్షులు జాదవ్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి వినాయక్ రావ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రశీఅనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేకత

**సత్తెనపల్లిలో రాస్తారోకో ఏఐయుకేఎస్**

**ఖానాపూర్ ఫిబ్రవరి 12( ప్రజా జ్యోతి ):** వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు రైతు, వ్యవసాయ,కార్మిక సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సమ్మె పిలుపులో భాగంగా గురువారం ఖానాపూర్ మండలం లోని సత్తెనపల్లి చౌరస్తా మంచిర్యాల ప్రధాన రోడ్డు వద్ద సంయుక్త కిసాన్ మోర్చా అఖిలభారత ఐక్య రైతు సంఘం, వ్యవసాయ, కార్మిక సంఘముల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది.కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిన కేంద్రం ఈ సమ్మె ద్వారా నైనా మోడీ సర్కార్ కళ్ళు తెరవాలని ప్రజా వ్యతిరేక రైతు వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నందిరామయ్య చుంచుల నారాయణ ఏఐయుకేఎస్ మండల నాయకులు జక్కుల రాజన్న, అడ్డగట్ల శంకర్, దేవరావు అభి,బాజీరావు, పూసం లక్ష్మణ్ ల్, జైతు, గోనె లచ్చన్న, గోరెబాయ్, గోనె నారాయణ,రేగుల గంగన్న, ఉపసర్పంచులు సోనేరావు, బీర్సావ్, గంగారం శాంతన తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఓట్ల లెక్కింపుకు పకడ్బందీ ఏర్పాట్లు



**ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి):** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లె క్కింపు ప్రక్రియను పారదర్శకం గా, నిబంధనలకు లోబడి నిర్వ హించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పట్టణం లోని ప్రభుత్వ టీటీడీసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రా న్ని గురువారం ఆయన ఎన్నికల సాధారణ పరిశీలకులు హ నుమంత్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ హాళు ,, భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, వెలుతురు తదితర సదుపా యాలను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు అవసరమై న సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 8 గంటల కు లెక్కింపు ప్రారంభమవు తుందని తెలిపారు. మొత్తం నాలుగు హాళ్లలో కౌంటింగ్ ని ర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 49 వార్డులకు గాను ఒక్కో వార్డుకు ఒక్కో టే బుల్ చొప్పున 49 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించా రు. ఈ ప్రక్రియలో సుమారు 180 మంది శిక్షణ పొందిన సి బ్బంది విధులు నిర్వహించ ను న్నారని తెలిపారు. ఒక్కో టేబు ల్ వద్ద మూడు రౌండ్ల లెక్కింపు ఉండగా, ప్రతి రౌండ్‌కు సుమా రు 90 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, వే గం కంటే ఖచ్చితత్వానికి ప్రా ధాన్యం ఇవ్వాలని అధికారుల ను ఆదేశించారు. మధ్యాహ్నం 2 గంటలలోపు ఫలితాలు వె ల్లడయ్యేలా సమన్వయంతో ప ని చేయాలని సూచించారు. జి ల్లా ఎన్నికల సాధారణ పరిశీల కులు హనుమంత్ నాయక్ మాట్లాడుతూ, పోలింగ్‌ను విజ యవంతంగా నిర్వహించినట్లే కౌంటింగ్‌ను కూడా క్రమశిక్షణ తో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బంది, ఏజెంట్లకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అధికారులు రాథోడ్ రవీందర్, రమేష్, ఫణీందర్ త దితర రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నా రు.



# కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచ ల భద్రత

**ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి):** నేడు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ప్రతిష్టమైన పోలీసు బందోబ స్తు ఏర్పాటు చేయడం జరిగిం దని జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్ ఐపిఎస్ తెలియజేశారు. కౌంటింగ్ కేంద్రం పూర్తిగా మూ డంచల భద్రతతో పటిష్టమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తె లిపారు. ఓట్ల లెక్కింపు కార్యక్ర మం స్థానిక టిటిడిసి ప్రాంగణం నందు జరగ నుండగా ప్రాంగ ణం పరిసర ప్రాంతాలలో 163 బిఎన్ఎస్ఎస్ ( 144 సెక్షన్) అ మలులో ఉందని, ప్రజలు గుం పులు గుంపులుగా తిరగడానికి అనుమతులు లేవని తెలిపా రు. ముఖ్యంగా ఎన్నికలలో వి జయం పొందిన నాయకులు విజయోత్సవ ర్యాలీలు నిర్వ హించడానికి అనుమతులు లే వని తెలిపారు. మరుసటి రోజు సంబంధిత అధికారుల అను మతులు తీసుకొని నిర్దేశించిన రోజు మాత్రమే విజయోత్సవ ర్యాలీలను నిర్వహించాలని తె లిపారు. టపాకాయలు పేల్చ డానికి, డీజే సౌండ్ లకు అను మతులు లేవని స్పష్టం చేశా రు. ప్రజలందరూ నియమ ని బంధనలు పాటించి, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడ కుండా ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా సహకరించాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా "ఐ లవ్ ఆదిలాబాద్ నుండి మావల పోలీస్ స్టేషన్ వరకు" ట్రాఫిక్



ఆంక్షలు ఉండనున్నట్లు, రేపు ఉదయం నుండి ఎన్నికల ఓ టింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు ఆంక్షలు కొనసాగుతా యని, ప్రజలు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగిం చుకోవాలని సూచించారు. ఎ న్నికల కోడ్ ఉల్లంఘించిన వా రిపై చట్ట ప్రకారం చర్యలు తీసు కోబడతాయని హెచ్చరించా రు. కౌంటింగ్ కేంద్రాలలోనికి వచ్చే ఏజెంట్లకు గానీ అభ్యర్థు లకు గానీ సెల్‌ఫోన్లను, ఎలక్ట్రా నిక్ వస్తువులకు అనుమతులు లేవని, అదేవిధంగా ఇంకు పె న్నులు లాంటి వాటిని తీసు కురావద్దని సూచించారు.



# కార్మిక,రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాస్తారోకో

**ఖానాపూర్ ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి ):** ఖానాపూర్ మండలంలోని తర్లపెట్ గ్రామం లో ఐఎఫ్టియు, ఐ కె ఎమ్ ఎస్ అధ్వ రాస్తారోకో గురువారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు డివిజన్ నాయకులు సునారికారి రాజేష్ మాట్లాడుతూ నిరుపేదలకు కల్పించాల్సిన మహాత్మా గాంధీ గ్రామీణ నిరుపేద ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే దిశలో రాంజీ పథకంగా మార్చి నిర్వీర్యం చేస్తున్నారన్నారు లేబర్ కోడ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర మోడీ సర్కార్ ను డిమాండ్ చేశారు జిల్లా అధ్యక్షులు దుర్గం లింగన్న, ఐఎఫ్టియు డివిజన్ నాయకులు ఆడెపు గణేష్, భూక్యా రాములు, మద్దినేని చిన్న రాజన్న, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మల్లక్క, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గోనే స్వామి, కోపాలి, డివిజన్ నాయకులు గోట్ల ప్రసాద్, గోగు శేఖర్, మాంకా శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలని - ర్యాలీ

**తహసిల్దార్ కు మెమోరండం అందజేత**




**నేరడిగొండ ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని గురువారం రోజున నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కార్మికులు ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి ర్యాలీ నిర్వహించి అక్కడి నుండి నేరుగా తహసిల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసిల్దార్ కు మెమోరాండం అందజేశారు, ఈ సందర్భంగా నేరడిగొండ మండల కార్మిక సంఘ అధ్యక్షులు పెరుమాండ్ల నరసయ్య మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు ఎటువంటి సదుపాయాలు అందడం లేదని అందువల్ల నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి మాకు న్యాయం చేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో, ఉపాధ్యక్షులు గంగాధరి గంగన్న, ప్రధాన కార్యదర్శి జింక భూమేష్, గాజుల సతీష్, పొట్టి బాబు, ఆనంద్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ ను వెంటనే రద్దు చేయాలి

**బోథ్, ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి):** కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని బోథ్ ఏ ఐ టియుసి డిమాండ్ చేశారు. అనంతరం ఎంఆర్ఓ



కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ఉన్న రక్షణ చట్టాలు బలహీనమవుతున్నాయని, ఈపీఎఫ్ పెన్షన్‌ను కనీసం రూ. 7500/–గా నిర్ణయించాలని, కనీస వేతనం చట్టబద్ధంగా అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంపూర్ణ సామాజిక భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే ఆమోదించకపోతే, భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ. అంగన్వాడి హమాలీ. యూనియన్ల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆగ్రహించిన కార్మిక సంఘాలు



ఇచ్చోడ, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తు న్న కార్మిక వ్యతిరేక విధానాల కు నిరసనగా వామపక్ష పార్టీ లు ఇచ్చిన భారత్ బంద్ పిలు పులో భాగంగా ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాల్లో పాక్షికంగా జ రగగా కార్మిక సంఘాలన్నీ స మ్మెలో పాల్గొన్నాయి. విధుల కు గైరాజరయ్యారు. దినసరి కూలీలుగా పనిచేస్తున్న కార్మికు లందరూ ఈ సమ్మె సందర్భం గా విధులకు హాజరు కాలేకపో యారు.ఏఐటియుసి, సిఐటి యు సంఘాలతో పాటు అనేక కార్మిక సంఘాలు కూడా ఈ స మ్మెలో పాల్గొన్నాయి జిల్లా కేం ద్రంతో పాటు వివిధ మండలా ల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వ హించి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ధర్నాలు చేపట్టారు తాసిల్దార్ కార్యాలయాలను ముట్టడించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్లకు వినతి పత్రాలు సమర్పించారు.

**ఇచ్చోడ లో........**

వామపక్ష పార్టీలు ఇచ్చిన పి లుపులో భాగంగా గురువారం ఇచ్చోడలో ఏఐటీయూసీ, సీ ఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ ధర్నా నిర్వ హించారు.

# వరుస దొంగతనాలకు పాల్ప డిన గజదొంగ అరెస్టు

ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి): స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం లో ఏర్పా టుచేసిన మీడియా సమావేశం లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజ న్ ఐపీఎస్ వివరాలను వెల్లడి స్తూ,ఉట్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతు న్న రాత్రి దొంగతనాల 7 కేసు లను ఛేదిస్తూ పోలీసులు గజ దొంగను అరెస్టు చేసినట్లు తెలి పారు.నిందితుడు టేకం రామా రావు ఏ తుకారం (40), తండ్రి ఆనందరావు, నాగాపూర్ గ్రా మం, ధంతన పల్లి గ్రామ పం చాయితీ, ఉట్నూర్ మండలా నికి చెందినవాడని తెలిపారు. ఇప్పటివరకు నిందితుడిపై మొ త్తం 36 కేసులు నమోదై ఉండ గా, కరీంనగర్, సిద్ది పేట్ ప్రాం తాల్లో దొంగతనాలు చేసినం దుకు గతంలో రెండు సంవత్స రాల జైలు శిక్ష అనుభవించి జ నవరి నెల 6న విడుదలైన అ నంతరం మళ్లీ ఉట్నూర్ మండ లంలో వరుసగా ఇళ్లలో దొంగ తనాలకు పాల్పడినట్లు పేర్కొ న్నారు.ఉట్నూర్ మండల పరి ధిలో క్రైమ్ నెంబర్లు 12/26, 15/26, 16/26, 17/26, 21/ 26, 29/26, 31/26గా మొత్తం ఏడు రాత్రి దొంగతన కేసులు న మోదయ్యాయి. గత నెల 6న విడుదలైన క్షణం నుండి మంచి ర్యాలలో స్కూటీ దొంగతనం చే సి ఉట్నూరుకు వచ్చి, ఊరు శి వారులో పాడుబడ్డ ఇళ్లలో, ని ర్మాణం జరుగుతున్న ఇళ్లలో ని వాసం ఉంటూ, రాత్రి సమయా లలో దొంగతనాలకు పాల్పడి నట్లు విచారణలో వెల్లడైంది. ఈరోజు ఉదయం దొంగిలించిన బంగారం, వెండి సామాగ్రితో మంచిర్యాల వైపు పారిపోతుం డగా కొత్తగూడ ఫారెస్ట్ చెక్‌పో స్ట్ వద్ద పోలీసులు అప్రమత్తం గా ఉండి నిందితుడిని పట్టుకు న్నట్లు ఎస్పీ వివరించారు. ఉ ట్నూర్ పోలీస్ స్టేషన్‌లో నమో దైన కేసులపై పూర్తి వివరాలను తెలియజేస్తూ జిల్లా ఎస్పీ విలే కరుల సమావేశం ఏర్పాటు చేశారు.

**స్వాధీనం చేసుకున్న ఆభరణాలు:**

3 వెండి కడియాలు 7 తు లాలు,1 బంగారు హారం 5 తులాలు, 6 బంగారు ఉంగరా లు 2.4 తులాలు, 2 జతల బంగారు కమ్మలు 1తులం,1 జత బంగారు మాటీలు 0.5 తులం,1 బంగారు చైన్ 2.5 తులాలు,2 జతల వెండి పట్టీ లు 13 తులాలు,మొత్తం 11.4 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం చేసు కున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీమా ట్లాడుతూ ప్రతి ఒక్కరు సీసీ టీ వీ కెమెరాలను ఏర్పాటు చేసు కునే విధంగా కృషి చేయాలని, గ్రామాలలో పట్టణాలలో వీధు లలో ప్రత్యేకంగా సిసి టీవీ కెమె రాలను ఏర్పాటు చేసుకున్న స మయంలో దొంగతనాలు జరగ కుండా ఉంటాయని, ఒకవేళ జరిగినప్పుడు వాటిని ఛేదించ డంలో ఉపయోగపడతాయని తెలిపారు. పట్టణంలో జిల్లా పోలీస్ శాఖ వివిధ రకాల స్వ చ్ఛంద సంస్థల ద్వారా సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే వి ధంగా కృషి చేస్తుందని తెలిపా రు. దొంగతనం జరిగిన ప్రదేశం లో క్లూస్ టీం, (డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ యూనిట్) వ చ్చేంతవరకు సంఘటన స్థలం యజమానులు, కుటుంబ స భ్యులు, మిత్రులు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని తెలి పారు. జిల్లాలో పటిష్టమైన క్లూ స్ టీం వ్యవస్థ విధులను నిర్వ ర్తిస్తుందని తెలిపారు. దొంగ త నాలను అరికట్టడానికి ఊర్లకు వెళ్లే సమయంలో యజమాను లు ప్రజలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ ని సంప్రదించి తమ వివ రాలను పొందు పరచాలని, రా త్రి పెట్రోలింగ్ సమయాల్లో పో లీసులు సంచరిస్తూ అప్రమత్త తో ఉంటారని తెలిపారు. పెద్ద పెద్ద తాళాలు బయటకు కని పించే విధంగా వేసి, దొంగలకు అవకాశాలు ఇవ్వవద్దని తెలి పారు.ఈ కార్యక్రమంలో ఉ ట్నూర్ సీఐ ఎం. ప్రసాద్, ఎస్సై గుంపుల విజయ్, పోలీస్ సి బ్బంది ఆర్ శ్యామ్ రావు, బి నరేష్, ఐ సుధాకర్ రెడ్డి పాల్గొ న్నారు.




# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బోథ్, ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి) : తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలుకా దయాల్ దన్నూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఈనెల 10 న రాత్రి సమయంలో మొక్క జొన్న పంటకు నీరు అందించేందుకు పొలానికి వెళ్లారు. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న సర్వే నం.89 వ్యవసాయ భూమిలో ఎలుగుబంటి దత్త బలిరాం జాదవ్ వయస్సు.55 గ్రామం. దయాల్ దన్నూర్ పై దాడి చేసింది. గ్రామానికి చెందిన మరో 8 మంది రైతును కాపాడే ప్రయత్నంలో వారు సైతం దాడికి గురయ్యారు. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడగా వారిలో ముగ్గురిని నాందేడ్ లోని ప్రభుత్వ ఆసుపత్రి లో, ఒకరిని సంబాజీ నగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ డి గురుస్వామి మాట్లాడుతూ బోథ్ మండలంలోని సరిహద్దు ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతానికి వెళ్ళవద్దని సూచించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు ఏదైనా ప్రమాదం అనిపిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సాఫ్ట్ స్కిల్స్ పై ఉచిత శిక్షణ




ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి): గిరిజన డిగ్రీ కళాశాలలో మ్యా జిక్ బస్ ఇండియా ఫౌండేష న్, హైదరాబాద్, కళాశాల ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యం లో బాల్యం నుండి జీవనోపాధి లక్ష్యంలో భాగంగా గురుకుల విద్యార్థులకు ఆర్టి ఫిషియల్ ఇంటలిజెన్స్, సాఫ్ట్ స్కిల్స్ ద్వా రా ఉపాధి నైపుణ్యాలను అందించడం ఈ కార్యక్రమ ము ఖ్య ఉద్దేశమని కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ ఎం.శివకృష్ణ తెలి పారు. ఈ కార్యక్రమంలో రిసో ర్స్ పర్సన్ కే.ప్రవీణ్ కుమార్, కళాశాల ట్రైనింగ్ ప్లేస్మెంట్ ఆ ఫీసర్ జి.లక్ష్మణ్, రాజేష్, ఇం చార్జ్ వైస్ ప్రిన్సిపాల్ శిరీష, అ ధ్యాపకులు, విద్యార్థులు పా ల్గొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 12 నుండి 18 వ తేదీ వరకు జరుగుతుందని తెలిపా రు.

# ఆగ్రహించిన కార్మిక సంఘాలు

ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తు న్న కార్మిక వ్యతిరేక విధానాల కు నిరసనగా వామపక్ష పార్టీ లు ఇచ్చిన భారత్ బంద్ పిలు పులో భాగంగా ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాల్లో పాక్షికంగా జ రగగా కార్మిక సంఘాలన్నీ స మ్మెలో పాల్గొన్నాయి. విధుల కు గైరాజరయ్యారు. దినసరి కూలీలుగా పనిచేస్తున్న కార్మికు లందరూ ఈ సమ్మె సందర్భం గా విధులకు హాజరు కాలేకపో యారు.ఏఐటియుసి, సిఐటి యు సంఘాలతో పాటు అనేక కార్మిక సంఘాలు కూడా ఈ స మ్మెలో పాల్గొన్నాయి జిల్లా కేం ద్రంతో పాటు వివిధ మండలా ల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వ హించి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ధర్నాలు చేపట్టారు తాసిల్దార్ కార్యాలయాలను ముట్టడించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్లకు వినతి పత్రాలు సమర్పించారు.



# నేడే బల్దియా బాస్‌ల భవితవ్యం

**ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి):** ఇటీవల జరిగిన పుర పోరు కు నేడు తెర పడనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన పని మున్సిపాలిటీలకు ఒక మున్సిపల్ కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఓట్ల లెక్కింపుకు అధికారులు ఏర్పా ట్లు పూర్తి చేశారు. పోలీసులు సైతం గట్టి బందోబస్తు ఏర్పా టు చేశారు. ఓట్ల లెక్కింపు ప్ర క్రియను స్థానిక మున్సిపాలి టీ ప్రాంతాలలోనే ఏర్పాట్లు చేశా రు. ఈ ఎన్నికల్లో గెలుపు తమదేనంటూ ఎవరి ధీమా వారు వ్యక్తపరుస్తూనే ఉన్నారు అయినప్పటికీ ప్రధాన పార్టీల అభ్యర్థులు వారి వారి క్యాంపు లకు తరలి వెళ్లారు ఇతర పా ర్టీలవైపు తొంగి చూడకుండా పార్టీ అధిష్టానం ల ఆదేశాల మేరకు ఇన్చార్జీలు ఇటీవల పోటీలో ఉన్న అభ్యర్థులంద రినీ దూర ప్రాంతాలకు తర లించారు. విహారయాత్రలకు ఇతర ప్రాంతాలకు తరలించా రు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ బిజెపి టిఆర్ఎస్ లకు చెందిన నేతలు స్వతంత్రులకు గాలం వేస్తున్నారు తమకు మ్యాజిక్ ఫిగర్ దొరకనట్లయితే స్వతం త్రులకు గాలం వేయాలని ముందుగానే ఆలోచించుకొని కొందరు స్వాతంత్రులు ఇప్పటి కే టచ్ లో ఉంచుకున్నారు. ఈ సారి బల్దియా పోరు రసవత్త రంగా జరిగింది. నేతలు పోటా పోటీగా ప్రచారం నిర్వహించా రు. టికెట్లు లభించని నేత లు రెబల్స్ గా రంగంలోకి దిగి పా ర్టీలకు చుక్కలు చూపించారు. ఈసారి బల్దియాలో స్వతంత్ర అభ్యర్థులు కూడా పె ద్ద ఎత్తున రంగంలోకి దిగారు. గడప గడ పకు,ఇంటింటి కి వెళ్లి ప్రచారం నిర్వహించారు. గెలుపు కోసం చెమటోడ్చారు. నిద్రాహారాలు మాని విస్తృత ప్రచారం నిర్వ హించారు. ఈ సారి అన్ని పార్టీ లు కూడా మహిళలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడంతో పెద్ద ఎత్తున మహిళలు కూడా రం గంలోకి దిగి తమ సత్తాచాటేం దుకు పోటీ పడ్డారు. స్వ తంత్ర అభ్యర్థులు, పార్టీల రెబల్స్ అ భ్యర్థులు తమ తమ సత్తా చా టు కునేందుకు పెద్ద ఎత్తున ప్ర చారాన్ని నిర్వహించారు. టికె ట్లు ఇవ్వని పార్టీలకు తగిన బుద్ధి చెబుతామంటూ సవాల్ విసిరి, గెలిచి చూపిస్తామని ప్ర తిన బూని బరిలో నిలిచారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10 మున్సిపాలిటీలకు, ఒక కా ర్పొరేషన్ కు ఈ



ఎన్నికలు జరి గాయి. మొదట పోటా పోటీ గా తమ నామినేషన్లు దాఖ లు చేసిన నేతలు ఆ తర్వాత మె ల్లిమెల్లిగా టికెట్లు దక్కక పో వడంతో పోటీ నుంచి అనేక మంది తప్పుకున్నారు. ఎన్నిక ల్లో పోటీ చేయడం ఖర్చుతో కూడుకున్నదని భావించి కొంద రు, పార్టీ పెద్దల బుజ్జగింపుల తో మరికొందరు, అనేక మంది పోటీలో నుంచి తప్పుకున్నా రు. అయినప్పటికీ కొందరు మొండిగా రెబల్స్ గా నిలిచా రు. అదిలాబాద్ బల్దియాలో దాదాపు 49 వార్డు ల స్థానాల కు గాను 314 మంది అభ్యర్థు లు పోటీ పడ్డారు. కాంగ్రెస్, బి జెపి, బిఆర్ఎస్ పార్టీలు 49 వార్డులకు గాను49 మంది చొ ప్పున అభ్యర్థులను రంగంలోకి దింపగా ఇతర పార్టీలకు చెంది న 65 మంది అభ్యర్థులు కూ డా రంగంలో ఉన్నారు. ఇదిలా ఉండగా అదిలాబాద్ బల్దియా లో స్వతంత్ర అభ్యర్థులు కూ డా పెద్ద ఎత్తున రంగంలో కి దిగారు. దాదాపు 93 మందిస్వ తంత్ర అభ్యర్థులు 49 స్థానాల్లో పోటీ పడ్డారు. ఇదిలా ఉండగా నిర్మల్ జిల్లాలో ఉన్న మూడు మున్సి పాలిటీలలో కూడా పోటా పోటీగా అభ్యర్థులు రం గంలోకి దిగారు. నిర్మల్ ము న్సిపాలిటీకి నిర్మల్ లో 42 వా ర్డుల స్థానాలకు గాను బి ఆర్ ఎస్ పార్టీ 36 స్థానాల్లో, బిజెపి 42, కాంగ్రెస్ పార్టీ 42 మంది చొప్పున అభ్యర్థులను రంగం లోకి దింపగా, ఇతరులు 35 మంది, స్వతంత్ర అభ్యర్థులు 27 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఇదే జిల్లాలో బైంసా మున్సిపాలిటీలో మొత్తం 26 వార్డు స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ 24, బిఆర్ఎస్15 స్థానా ల్లో పోటీలో ఉండగా, బిజెపి అ భ్యర్థులు కేవలం 12 స్థానాల్లో మాత్రమే పోటీ పడ్డారు. బైంసా లో బిజెపి కేవలం 12 స్థానాల్లో పోటీ పడడం పలువురిని ఆశ్చర్య పరిచింది.

# ఓ ఎలుగుబంటు.. మమ్మల్ని మన్నించు

**బోథ్, ఫిబ్రవరి 12 (ప్రజా జ్యోతి):** ఓ భళ్ళుకమా బయోత్పాతాన్ని సృష్టించకు శాంతించుమా సకల జీవరాసులం సమానంగా సృష్టించబడ్డాం. వివేకం విజ్ఞానం విచక్షణా ఉన్న మానవులం ఒక్కొక్కసారి మానవత్వాన్ని మరిచి మృగం కంటే హీనంగా మారుతాం. చరాచర జగత్తులో సకల జీవరాసులలో సాటి లేని సంపన్నులుగా మాకు పోటీ లేనివారుగా పోకడలు పోతాం. నీవు మాలాంటి జీవమున్న ప్రాణులే అన్న సంగతిని అప్పుడప్పుడు మర్చిపోతాం. అయినా మన్నించు. తల్లి ఓ ఎలుగుబంటి. ఎనకా ముందు ఆలోచించక మా స్వార్థం కోసం మనిషినే వాడే బతకాలి మిగతా జీవులు బానిసలుగా మారాలి . అనే మా ధోరణిని మన్నించు. ఎందుకంటే మేం బతకాలని ఆశ శ్వాస కోసం అక్రమ కరెంటులు పెడతాం అవసరమైతే వన్యజీవులకు తావు లేకుండా చేస్తాం. తప్పని తెలిసినా తాము ఎవరిని లెక్కచేయం. అయినా ఓ తల్లి మన్నించు. కాదు కాదు శాంతించు. నీ భూభాగంలోకి వచ్చి నీవున్న చోట మేముండి ఆక్రమిస్తాం అవసరమైతే ఆపదలను సృష్టిస్తాం. వన్య జీవుల గోసకు గోరి కడతాం. మా స్వార్థానికి వన్యప్రాణులకు వనములో తావు లేదంటాం. మా ఒక్కరికే చోటంటం నీ చోటుని ఆక్రమిస్తాం చోద్యం చూస్తాం. అయినా మమ్మల్ని మన్నించు. ఎందుకంటే మేము మనుషులం. మాకంటూ సమాజంలో ఒక సామాజిక ఓడంబిక చేసుకున్నాం. సాంగత్యంతో సాగుతున్నాం. జ్ఞానం ఉంది విజ్ఞానం ఉంది ఆధునిక పోకడలను పునికిపుచ్చుకున్నాం. ఏమన్నా అంటే ప్రజాస్వామ్యం అంటాం ప్రతి ఒక్క జీవికి జీవించే హక్కు అంటాం. అయినా మేం మాలాంటి జీవుల పట్ల ముఖ్యంగా వన్యప్రాణుల పట్ల పాటించాం.ఆలోచన ఉంది అంతకంటే ఎక్కువ ఆవేశం స్వార్థం ఉంది. సారీ మమ్మల్ని మన్నించు. నీ ఇలాకలోకి వచ్చి నీ సంతతికి చరమగీతం పాడితే చావు తప్పదు అని నీ సంకేతం వద్దు తల్లి వద్దు. నీలాంటి ఓ ప్రాణం ఉన్న మనుషులం మేం మానవత్వం ఉన్న మనుషులం. మా తప్పుని క్షమించి మమ్మల్ని మన్నించు తల్లి. ఓ ఎలుగుబంటి ఎందుకంత కోపం నీ తాపం తపన తనయుల కోసమే కదా! మేము చేసింది తప్పే కావచ్చు. అయినా మన్నించు మమ్మల్ని మన్నించు. ఓ వన్య ప్రాణి తల్లులారా పచ్చని అడవి తల్లి బిడ్డలారా మేము ఒకనాటి ఆదిమా మానవ అడవులలో పెరిగిన సకల జీవరాశిలో మీలాంటి ప్రాణులమే. మాపై దయ చూపు మా తప్పుని క్షమించి మన్నించు. ఇకనైనా మానవత్వం ఉన్న మనుషులుగా మారుతాం. సాటి ప్రాణుల పట్ల సగౌరవంగా మెలుగుతాం. మమ్మల్ని మన్నించు మట్టిలో కలిసేలా మరణాన్ని ప్రసాదించకు మాలాంటి ప్రాణులే అని మనుష లుగా గుర్తించి మన్నించు మన్నించు. అడవి తల్లి ఒడిలో ఆహ్లాదంగా జీవించు అయినా ఓ భల్లూకమా మమ్మల్ని భూదేవి మాత అంతా సహనాన్ని గుర్తించి తెచ్చుకొని భరించు.



# అన్ని లావాదేవీలు ఆన్ లైన్ చేయాలి

**గిరిజన సహకార సంస్థ ఉట్లు డివిజనల్ మేనేజర్ సందీప్ కుమార్**

**ఉట్నూర్, ఫిబ్రవరి 12, (ప్రజా జ్యోతి):** గిరిజన సహకార సంస్థ (జీసీ సీ), ఉట్నూర్ డివిజన్ పరిధి లోని అన్ని సొసైటీ లలో జరిగే ఆర్థిక లావాదేవీలు అన్ని ఆన్ లైన్ చేయాలనీ, సాంకేతికత ఉపయోగించుకొని ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా రిజస్టర్ల ను నిర్వహించాలని ఉ ట్నూర్ జీసీసీ డివిజనల్ మేనే జర్ గుడిమళ్ల సందీప్ కుమార్ స్పష్టం చేశారు.గురువారం ఉ ట్నూర్ కెబి కాంప్లెక్స్ లోని స మావేశ మందిరం లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఉ ట్నూర్ డివిజన్ లో పనిచేస్తు న్న సొసైటీ సీనియర్ మేనేజర్లు, మేనేజర్లు, అకౌంటెంట్ లు, జూ నియర్ అసిస్టెంట్ లు, కంప్యూ ట ర్ ఆపరేటర్ లకు రెండు రో జుల శిక్షణ, సమీక్ష సమావేశా న్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా సందీప్ కుమా ర్ మాట్లాడుతూ అన్ని లావా దేవీలు ఆన్ లైన్ చేయాలనీ, సిబ్బంది కి అవగాహన కల్పిం చటం కోసం హైద్రాబాద్ నుండి రిసోర్స్ పర్సన్ ని పిలిపించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వెంటనే అన్ని కాష్ బుక్ లను ఆన్లైన్ చేయాలనీ, అమలు చే యని సిబ్బంది పై చర్యలు తీ సుకుంటాం అని స్పష్టం చేశా రు. వసతి గృహలకు సరఫరా చేసే నిత్యావసర వస్తువుల తో పాటు సొసైటీల లో జరిగే లా వాదేవీలు, పెట్రోల్ బంక్ లు, ని త్యావసర వస్తువుల విక్రయశా ల (డీఆర్ డిపో) లో జరిగే సమస్త లావాదేవీలు ఆన్లైన్ చే యాలనీ ఆదేశించారు. దానికి సంభందించిన సాఫ్ట్ వేర్ పై అ వగాహన కల్పించారు. ఈ కా ర్యక్రమం లో రిసోర్స్ పర్సన్ ఎ ల్విఎస్ రవి కుమార్, సీనియ ర్ మేనేజర్ సంతోష్ కుమార్, సూపరింటెండెంట్ గులాబ్ సిం గ్, మేనేజర్లు శ్రీనివాస్, రమేష్, ఇస్తారి, మనోహర్ అకౌంటెం ట్లు, జూనియర్ అసిస్టెంట్లు, కం ప్యూటర్ ఆపరేటర్లు, డివిజ నల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నా రు.

